# హైదరాబాద్ పల్స్

జాతీయ తెలుగు దినపత్రిక

దేశం ముఖ్యం.... దేశ ప్రజల భద్రత ముఖ్యం.... మతం కాదు...

epaper.hyderabadpulsenews.in



విలేకరులు కావలెను

హైదరాబాద్ పల్స్

"ఎంతకైనా తెగిస్తాం... ప్రజల గొంతుకై నిలుస్తాం" అనే నినాదంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రారంభించిన హైదరాబాద్ పల్స్ జాతీయ దినపత్రికకు తెలుగు రాష్ట్రాలలోని అన్ని మండల, నియోజకవర్గాల, జిల్లాల వ్యాప్తంగా విలేకరులు కావలెను. * సీనియర్లకు ప్రాధాన్యత కలదు.

సంప్రదించవలసిన ఫోన్ నెంబర్స్

- Dr. RAHUL KUMAR 9989834020
- K. Naveen Kumar 94406 53413

www.hyderabadpulse.com HyderabadPulse @hyderabad



సీఈఓ : కె నవీన్ కుమార్ | ఎడిటర్: డా. రాహుల్ కుమార్ | సంపుటి: 03 | సంచిక : 181 | పేజీలు : 08 | శుక్రవారం | 10-07-2026 | వెల :4/-

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD, SANGAREDDY, WARANGAL, MANCHIRYAL, VIJAYWADA, GUNTUR, KURNOOL, TIRUPATI, KADAPA, BENGALURU, MUMBAI, CHENNAI, DELHI.


## 1,400 కోట్లపై విచారణ జరిపించాలి

- బీఆర్ఎస్ పార్టీ ఖాతాలోని రూ. 1,400 కోట్లపై విచారణ జరిపించాలి: కవిత
- బీఆర్ఎస్ ఖాతాలో ఉన్న నిధులు స్వచ్ఛమైనవి కావన్న కవిత
- ఆ డబ్బులు క్విడ్ ప్రోకో ద్వారా వచ్చాయని ఆరోపణ
- ప్రాణం ఉన్నంత వరకు బీఆర్ఎస్ పార్టీలో చేరనని వ్యాఖ్య




2

హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

బీఆర్ఎస్ పార్టీపై తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత తీవ్ర ఆరోపణలు చేశారు. ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీ బ్యాంకు ఖాతాలో ఉన్న రూ. 1,400 కోట్ల నిధులు స్వచ్ఛమైనవి కావని అన్నారు. అవన్నీ క్విడ్ ప్రోకో ద్వారా వచ్చినవేనని ఆరోపించారు. ఆ నిధులపై తక్షణమే సమగ్ర విచారణ జరిపించి, ఆ డబ్బును తెలంగాణ ఉద్యమకారుల కుటుంబాలకు పంచాలి అని డిమాండ్ చేశారు. తన కంఠంలో ప్రాణం ఉన్నంత వరకు మళ్లీ బీఆర్ఎస్ పార్టీలో చేరే

## మనవడి కోసం పూరీలు చేసిన సీఎం రేవంత్ రెడ్డి..

- ఈ సరదా క్షణాలను వీడియో తీసి సోషల్ మీడియాలో పంచుకున్న ముఖ్యమంత్రి
- ముఖ్యమంత్రిలోని తాత ప్రేమపై నెటిజన్ల ప్రశంసలు
- తీరికలేని జీవితంలో ఇవే మధుర క్షణాలంటూ భావోద్వేగ పోస్ట్



# హైదరాబాద్ సేఫ్ ప్లేస్

## అందుకే పెట్టుబడులు వస్తున్నాయి

సీఎం రేవంత్ రెడ్డి

- ఇండియాస్ నెక్ట్స్-జెన్ సోలార్ మాడ్యూల్ యూనిట్‌ను ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి
- పరిశ్రమలను ఓఆర్ఆర్ వెలుపలకు తరలించాలని నిర్ణయించామని వెల్లడి
- విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పరిశ్రమలు రావాలని పిలుపు

హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

ప్రతిపక్షాలు ప్రభుత్వంపై విషం చిమ్మడం ఆపి రాష్ట్ర అభివృద్ధికి సహకరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హితవుపలికారు. కాలుష్యపు కోరల నుంచి నగరాన్ని రక్షించేందుకు పరిశ్రమల్ని ఓఆర్?ఆర్? వెలుపలకు తరలిస్తామని పునరుద్ఘాటించారు. రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం షాబాద్ మండలం సీతారాంపురంలో ప్రీమియర్ ఎనర్జీస్ యూనిట్‌ను మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి శ్రీకారంచుట్టారు. పరిశ్రమల అవసరాలకు అనగుణంగా విద్యార్థుల్లో నైపుణ్యాలు ఉండాలని సీఎం ఆకాంక్షించారు.

కాలుష్యం, ట్రాఫిక్ సమస్యలు వేధిస్తున్నాయి

భద్రత ఉండే చోటే ఎక్కువ పెట్టుబడులు వస్తాయన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హైదరాబాద్ అందుకు అత్యంత అనుకూల ప్రదేశమని అభివర్ణించారు. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నియోజకవర్గం పరిధిలోని షాబాద్ మండలం సీతారాంపురంలో ప్రీమియర్ ఎనర్జీస్ యూనిట్‌ను సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, స్థానిక ఎమ్మెల్యే, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. సీతారాంపురం ప్రజల త్యాగాల వల్లే ఇక్కడ పరిశ్రమలు ఏర్పాటు అయ్యాయని అభినందించారు. అత్యంత నివాస అనుకూల నగరాల జాబితాలో హైదరాబాద్ ముందు ఉన్నప్పటికీ కాలుష్యం, ట్రాఫిక్ సమస్యలు వేధిస్తున్నాయని వాటి శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం సమగ్ర ప్రణాళికలతో

2




## నిరుద్యోగులకు గుడ్ న్యూస్..

తెలంగాణ ఆర్టీసీలో 1500 కండక్టర్ పోస్టులు

2




- పర్మినెంట్ ప్రాతిపదికన కండక్టర్ ఉద్యోగాల భర్తీ
- రాత పరీక్ష, ఇంటర్వ్యూ లేకుండానే నియామకాలు
- పదో తరగతి మార్కుల ఆధారంగా ఉద్యోగాలు

హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

నిరుద్యోగ యువతకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అదిరిపోయే శుభవార్త చెప్పింది. తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ లో ఖాళీగా ఉన్న 1,500 కండక్టర్ పోస్టుల భర్తీకి సర్కారు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ నియామక ప్రక్రియను ఆర్టీసీ యాజమాన్యమే నేరుగా చేపట్టబోతుండగా... చాలా సంవత్సరాల తర్వాత తెలంగాణలో పర్మినెంట్ (శాశ్వత) ప్రాతిపదికన కండక్టర్

## కడియంది కపట బుద్ధి..

### నా శాఖను హైజాక్ చేశారు: కొండా సురేఖ



2

- పీసీసీ చీఫ్‌కు సురేఖ ఫిర్యాదు కడియంపై చర్యలు కోరిన మంత్రి
- తనకు తెలియకుండా తన దేవాదాయ శాఖలో సమీక్ష నిర్వహించారని ఫిర్యాదు
- సీఎం, మీనాక్షి నటరాజన్ దృష్టికీ తీసుకెళ్లినట్లు వెల్లడి
- ఎదుటివాళ్ల ఎదుగుదలను కడియం ఓర్వలేరని విమర్శ

## పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు..

ఆస్ట్రేలియాలో స్పందించిన ప్రధాని మోదీ

- పశ్చిమాసియా ఉద్రిక్తతలపై ప్రధాని మోదీ ఆందోళన
- అమెరికా, ఇరాన్ మధ్య మళ్లీ మొదలైన సైనిక దాడులు
- చర్చలు, దౌత్యంతోనే సమస్యలు పరిష్కారమవుతాయన్న మోదీ

2



హైదరాబాద్ పల్స్,డెస్క్

పశ్చిమాసియాలో అమెరికా, ఇరాన్ మధ్య మరోసారి ఉద్రిక్తతలు చోటుచేసుకున్న నేపథ్యంలో, సమస్యల పరిష్కారానికి చర్చలు,

## షరతులతో కూడిన బెయిల్

- పోక్సో కేసు: బండి భగీరథ్‌కు షరతులతో కూడిన బెయిల్
- దర్యాప్తునకు పూర్తిగా సహకరించాలని హైకోర్టు ఆదేశం
- 45 రోజులకు పైగా జైల్లో ఉన్న బండి భగీరథ్
- త్వరలో చార్జిషీట్ దాఖలు చేయనున్న పోలీసులు

హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథ్‌కు తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. పోక్సో చట్టం కింద నమోదైన కేసులో అతడికి గురువారం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేస్తూ న్యాయస్థానం ఉత్తర్వులు జారీ చేసింది. దర్యాప్తునకు పూర్తిగా సహకరించాలని ఈ సందర్భంగా భగీరథ్‌ను హైకోర్టు ఆదేశించింది.ఒక మైనర్ బాలికకు

2




## భూ వివాద రహిత ఏపీనే లక్ష్యం..

సీఎం చంద్రబాబు

- బనగానపల్లెలో 'మీ భూమి-మీ హక్కు' కార్యక్రమంలో పాల్గొన్న సీఎం చంద్రబాబు
- వివాదాస్పద ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేశామని వెల్లడి
- భూవివాద రహిత రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్న సీఎం
- రాయలసీమలో భారీ పరిశ్రమలు, హార్టికల్చర్ హబ్‌తో అభివృద్ధికి బాటలు
- వర్షాభావ పరిస్థితులను అధిగమించేందుకు 'జలధార' కార్యక్రమం ప్రారంభం

2



హైదరాబాద్ పల్స్,డెస్క్

రాష్ట్రంలో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపి, ఆంధ్రప్రదేశ్‌ను భూవివాద రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే తమ కూటమి

## రాజ్యసభ బీఆర్ఎస్ పార్టీ ఫ్లోర్ లీడర్‌గా వద్దిరాజు రవిచంద్ర

- ఫ్లోర్ లీడర్‌గా ముగిసిన సురేశ్ రెడ్డి పదవీకాలం
- ఆ స్థానంలో రవిచంద్రను నియమించిన కేసీఆర్
- కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపిన మున్నూరు కాపు సంఘం

2




హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

రాజ్యసభలో బీఆర్ఎస్ పార్టీ ఫ్లోర్ లీడర్‌గా ఉన్న సురేశ్ రెడ్డి పదవీకాలం ముగియడంతో, ఆయన స్థానంలో ప్రస్తుత డిప్యూటీ ఫ్లోర్ లీడర్, ఎంపీ వద్దిరాజు రవిచంద్రను ఫ్లోర్ లీడర్‌గా బీఆర్ఎస్ అధినేత

# 1,400 కోట్లపై విచారణ జరిపించాలి

మొదటి పేజీ రువాయి

ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు.సింగరేణి సంస్థ పరిరక్షణ, కార్మికుల హక్కుల సాధనే ధ్యేయంగా చేపట్టిన 'సింగరేణి బాయి బాట' కార్యక్రమంలో భాగంగా తాను క్షేత్రస్థాయిలో కార్మికులతో మమేకమవుతున్నట్లు కవిత తెలిపారు. ప్రభుత్వ అనాలోచిత విధానాలు, చెల్లించాల్సిన బకాయిల కారణంగా సింగరేణి సంస్థపై పెను భారం పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం సంస్థ ఎంతటి ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిందంటే... కనీసం కార్మికులకు అవసరమైన పనిముట్లు (మైనింగ్ పరికరాలు) కూడా కొనలేని దుస్థితి నెలకొందని మండిపడ్డారు. "ఇక్కడ అధికారులకు ఓ రూల్... రాత్రింబవళ్లు కష్టపడే కార్మికులకు మరో రూల్‌లా యాజమాన్యం వ్యవహరిస్తున్నారు" అని ఆగ్రహం వ్యక్తం చేశారు.కేంద్రంలోని బీజేపీ వైఖరి వల్ల తెలంగాణ హక్కుగా ఉన్న బొగ్గు బ్లాక్‌లు ప్రైవేట్‌పరం అవుతున్నాయని కవిత విమర్శించారు. తెలంగాణ రాకముందు సింగరేణిలో 62 వేల మంది రెగ్యులర్ కార్మికులు ఉండగా, నేడు ఆ సంఖ్య 38 వేలకు పడిపోయిందని గుర్తుచేశారు. కాంట్రాక్ట్, పర్మినెంట్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. "కార్మికుల వారసత్వ (డిపెండెంట్) ఉద్యోగాల కోసం నెలలో కనీసం రెండు సార్లు మెడికల్ బోర్డ్ నిర్వహించాలి. ఒకవేళ ప్రభుత్వం, యాజమాన్యం డిపెండెంట్ ఉద్యోగాలపై స్పష్టత ఇవ్వకపోతే.. ఈనెల 20 నుంచి రామగుండం వేదికగా నిరవధిక దీక్ష చేపడతాం" అని స్పష్టం చేశారు.

# పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు..

మొదటి పేజీ రువాయి

దౌత్యమే ఏకైక మార్గమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ఇరు దేశాలు సంయమనం పాటించాలని ఆయన సూచించారు. ప్రస్తుతం ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న ఆయన, గురువారం మెల్‌బోర్న్‌లో ఈ కీలక వ్యాఖ్యలు చేశారు.హర్మూజ్ జలసంధిలో వాణిజ్య నౌకలపై ఇరాన్ దాడులకు పాల్పడటంతో, అమెరికా ప్రతిగా సైనిక చర్యలు చేపట్టింది. ఇరాన్‌కు చెందిన బుషెహర్, చాబహార్ సహా పలు తీర ప్రాంతాల్లోని సైనిక స్థావరాలపై దాడులు జరిపినట్లు యూఎస్ సెంట్రల్ కమాండ్ ప్రకటించింది. ఈ దాడులతో ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు తీవ్రస్థాయికి చేరాయి.ఈ పరిణామాలపై ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్‌తో కలిసి మీడియాతో మాట్లాడిన మోదీ, "ప్రపంచంలో కొనసాగుతున్న ఏ వివాదానికైనా చర్చలు, దౌత్య మార్గాల ద్వారానే పరిష్కారం సాధ్యమవుతుంది" అని స్పష్టం చేశారు. పౌరుల భద్రతను కాపాడాలని, వాణిజ్య కార్యకలాపాలకు ఎటువంటి ఆటంకం కలగకుండా చూడాలని ఇరు దేశాల నేతలు సంయుక్త ప్రకటనలో కోరారు.పశ్చిమాసియాలో తలెత్తిన ఈ తాజా ఘర్షణలు అంతర్జాతీయ ఇంధన మార్కెట్లు, వాణిజ్య మార్గాలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. ముఖ్యంగా భారత్ వంటి దేశాలకు చమురు సరఫరా, ఇంధన భద్రతకు విఘాతం కలిగే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలోనే భారత్ తన ప్రయోజనాలను, ప్రవాస భారతీయుల భద్రతను దృష్టిలో ఉంచుకుని దౌత్యపరమైన పరిష్కారాన్ని ఆకాంక్షిస్తోంది.

# షరతులతో కూడిన బెయిల్

మొదటి పేజీ రువాయి

సంబంధించిన ఉదంతంలో మే 8వ తేదీన పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో భగీరథ్‌పై పోక్సో కేసు నమోదైంది. ఈ కేసులో మే 16న పోలీసులు అతడిని అరెస్ట్ చేయగా, అప్పటి నుంచి చర్లపల్లి జైలులో జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్నాడు. దాదాపు 45 రోజులుగా అతడు జైలులోనే ఉంటున్నాడు.బెయిల్ పిటిషన్‌పై విచారణ సందర్భంగా భగీరథ్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ, నిందితుడు విద్యార్థి అని, జైలులో ఉండటం వల్ల చదువు నష్టపోతున్నాడని కోర్టుకు విన్నవించారు. అయితే, పబ్లిక్ ప్రాసిక్యూటర్ బెయిల్‌ను వ్యతిరేకించారు. దర్యాప్తు కీలక దశలో ఉందని, నిందితుడిని విడుదల చేస్తే సాక్షులను ప్రభావితం చేసే అవకాశం ఉందని వాదించారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి జస్టిస్ కె. సుజన భగీరథ్‌కు బెయిల్ మంజూరు చేశారు. కాగా, తన బీబీఏ పరీక్షలకు హాజరయ్యేందుకు భగీరథ్‌కు గతంలో హైకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసిన విషయం తెలిసిందే.



# నిరుద్యోగులకు గుడ్ న్యూస్..

మొదటి పేజీ రువాయి

ఉద్యోగాలను భర్తీ చేస్తుండటం విశేషం.ఈ నోటిఫికేషన్‌లో అభ్యర్థులకు ఊరటనిచ్చే అత్యంత ముఖ్యమైన విషయం ఏంటంటే.. ఈ ఉద్యోగాలకు ఎలాంటి రాత పరీక్ష, ఇంటర్వ్యూ నిర్వహించడం లేదు. కేవలం టెన్త్ క్లాస్ లో సాధించిన మార్కుల శాతాన్ని ప్రాతిపదికగా తీసుకుంటారు. ప్రభుత్వం నిర్దేశించిన రోస్టర్ విధానం, రిజర్వేషన్ నిబంధనల ప్రకారం అభ్యర్థుల మెరిట్ లిస్ట్‌ను సిద్ధం చేసి నేరుగా ఎంపిక ప్రక్రియ చేపడతారు. ఎలాంటి పోటీ పరీక్షలు లేకుండానే ప్రభుత్వ ఉద్యోగం సాధించే సువర్ణావకాశం కావడంతో నిరుద్యోగుల్లో హర్షం వ్యక్తమవుతోంది.ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఆర్టీసీలో పర్మినెంట్ బేసిస్‌పై కండక్టర్ పోస్టులను భర్తీ చేయడం ఇదే మొదటిసారి. గత కొన్నేళ్లుగా చాలా మంది ఉద్యోగులు రిటైర్ కావడంతో ఖాళీలు భారీగా పెరిగాయి. ముఖ్యంగా హైదరాబాద్, సికింద్రాబాద్ లాంటి మహానగరాల్లో ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ఇప్పటివరకు తాత్కాలికంగా ఔట్‌సోర్సింగ్ సిబ్బందితోనే బస్సులను నడిపించారు. ఇప్పుడు నేరుగా ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి అనుమతి రావడంతో ఆర్టీసీ రూపురేఖలు మారనున్నాయి.అయితే, అఫీషియల్ నోటిఫికేషన్ విడుదలకు ముందు ఒక చిన్న సాంకేతిక సమస్య ఎదురైంది. గతంలో ఎస్ఎస్‌సీ బోర్డు మార్కుల విధానాన్ని అమలు చేయగా.. ఆ తర్వాత కొన్నేళ్ల పాటు జీపీఏ గ్రేడింగ్ విధానాన్ని తెచ్చింది. మళ్లీ ఇటీవల మార్కుల విధానాన్ని కొనసాగిస్తోంది. దీనివల్ల అప్లై చేసుకునే అభ్యర్థుల్లో కొందరికి మార్కులు, మరికొందరికి కేవలం గ్రేడింగ్ మాత్రమే సర్టిఫికేట్లలో ఉన్నాయి.దీంతో జీపీఏ గ్రేడింగ్‌ను మార్కుల శాతంలోకి ఎలా కన్వర్ట్ చేయాలి? ఇరు విధానాల అభ్యర్థులను సమానంగా ఎలా అంచనా వేయాలనే దానిపై స్పష్టత ఇవ్వాలని ఆర్టీసీ అధికారులు ఎస్ఎస్‌సీ బోర్డుకు లేఖ రాశారు. బోర్డు నుంచి ఈ మార్గదర్శకాలు అందిన వెంటనే కండక్టర్ ఉద్యోగాల అధికారిక నోటిఫికేషన్ విడుదల కానుంది.

# హైదరాబాద్ సేఫ్ ప్లేస్

మొదటి పేజీ రువాయి

ముందుకెళుతోందని సీఎం వివరించారు.

ప్రజల త్యాగాల వల్లే పరిశ్రమలు

2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్స్ ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ ఎదుగుతుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విశ్వాసం వ్యక్తం చేశారు. యువతలో నైపుణ్యాభివృద్ధి కోసమే స్కిల్స్ యూనివర్సిటీ నెలకొల్పామని రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రతీ సంవత్సరం 1.10 లక్షల మంది యువత ఇంజినీరింగ్ పట్టాలతో బయటకి వస్తున్నారన్న ఆయన విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పరిశ్రమలు రావాలని కోరారు. బ్లూకాలర్ ఎంప్లాయిస్‌లో కొత్త స్కిల్స్ పెంచేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని, సీతారాంపురం ప్రజల త్యాగాల వల్లే ఇక్కడ పరిశ్రమలు ఏర్పాటయ్యాయని వెల్లడించారు.

హైదరాబాద్‌ను కూడా కాలుష్య సమస్య వేధిస్తోంది

గతంలోనూ రంగారెడ్డి జిల్లా ప్రజల త్యాగాల వల్లే ఓఆర్ఆర్, పరిశ్రమలు వచ్చాయని సీఎం కొనియాడారు. అత్యంత నివాస అనుకూల నగరాల జాబితాలో హైదరాబాద్ ముందుంటుందని, అయినప్పటికీ హైదరాబాద్‌ను కూడా కాలుష్య సమస్య వేధిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడ 1.34 కోట్ల మంది నివసిస్తున్నారని, అందుకే సిటీలో ఉన్న పరిశ్రమలను ఓఆర్ఆర్ వెలుపలకు తరలించాలని నిర్ణయించామని స్పష్టం చేశారు. పెరి అర్బన్ రీజియన్‌లో ప్రత్యేక మాన్యుఫ్యాక్చరింగ్ జోన్లు ఏర్పాటు చేస్తున్నామని వివరించారు.



## రాజ్యసభ బీఆర్ఎస్ పార్టీ ఫ్లోం లీడర్‌గా వద్దిరాజు రవిచంద్ర

మొదటి పేజీ రువాయి

కేసీఆర్ నియమించారు. పార్టీ కోసం వద్దిరాజు చేసిన సేవలను గుర్తించి ఈ కీలక బాధ్యతలు అప్పగించారు.ఈ నియామకం పట్ల తెలంగాణ మున్నూరు కాపు సంఘం నాయకులు పార్టీ అధినేత కేసీఆర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. వద్దిరాజు రవిచంద్రకు ఈ ఉన్నత పదవి దక్కడం బీసీల ఎదుగుదలకు, తెలంగాణ హక్కుల సాధనకు ఎంతో కీలకంగా మారుతుందని మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు సర్దార్ పుటం పురుషోత్తం పటేల్ ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్రం నుంచి తెలంగాణ రాష్ట్రానికి రావలసిన రాజ్యాంగపరమైన నిధులు, హక్కుల సాధనలో వద్దిరాజు పార్లమెంట్‌లో మరింత సమర్థవంతంగా గళం విప్పుతారని మున్నూరు కాపు సమాజం ఆశాభావం వ్యక్తం చేసింది.

# భూ వివాద రహిత ఏపీనే లక్ష్యం..

మొదటి పేజీ రువాయి

ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. గత పాలకుల అరాచకాలు, పాపాలు ప్రజలకు శాపాలుగా మారాయని, వారి నల్ల చట్టాలను రద్దు చేసి ప్రజల ఆస్తులకు భద్రత కల్పిస్తున్నామని ఆయన అన్నారు.నంద్యాల జిల్లా బనగానపల్లెలో నిర్వహించిన 'మీ భూమి- మీ హక్కు' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, రైతులకు కొత్త పట్టాదారు పాస్‌బుక్‌లను పంపిణీ చేసి ప్రజావేదిక సభలో ప్రసంగించారు.గత ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ఒక నల్ల చట్టమని, ప్రజల ఆస్తులను కాజేసేందుకు, వారిలో భయాందోళనలు సృష్టించేందుకే దానిని తెచ్చారని చంద్రబాబు తీవ్రంగా విమర్శించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ చట్టాన్ని రద్దు చేస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చామని గుర్తుచేశారు. "గత పాలకులు తమకు నచ్చని వారిని భయపెట్టేందుకు వారి భూములను 22ఏ జాబితాలో పెట్టేశారు. వివాదాలు సృష్టించి భూములు లాక్కోవాలని చూశారు. భూమి పత్రాలపై, చివరికి సర్వే రాళ్లపై కూడా వారి ఫొటోలు వేసుకున్నారు. ఆ ఫొటోల పిచ్చిని రద్దు చేసి, ఇప్పుడు రాష్ట్ర రాజముద్రతో, పటిష్ఠమైన భద్రతా ఫీచర్లతో కొత్త పట్టాదారు పాస్‌బుక్‌లు అందిస్తున్నాం" అని చంద్రబాబు వివరించారు. ఈ పంపిణీని ఒక పవిత్ర ఉద్యమంగా చేపడుతున్నామని, 2027 మార్చి నాటికి రాష్ట్రంలోని 9,833 గ్రామాల్లో 72,70,605 పాస్‌బుక్‌లు పంపిణీ చేస్తామని తెలిపారు.భూ సమస్యల పరిష్కారంలో తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని ముఖ్యమంత్రి ఉద్ఘాటించారు. తిరుపతి, గుంటూరు, చిత్తూరు జిల్లాల్లో ఏళ్లుగా నలుగుతున్న భూ వివాదాలను పరిష్కరించామని తెలిపారు. డోన్ నియోజకవర్గంలో 2,074 ఎకరాల వక్ఫ్ భూములను 22ఏ జాబితా నుంచి తొలగించి రైతులకు న్యాయం చేశామని చెప్పారు. ఆటో మ్యూటేషన్ ద్వారా వారసత్వ ఆస్తులను సులభంగా బదిలీ చేసే ప్రక్రియను అమలు చేస్తున్నామన్నారు.రాయలసీమ ముఖచిత్రాన్ని మారుస్తున్నామని, ఈ ప్రాంత అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని చంద్రబాబు పునరుద్ఘాటించారు. కడప స్టీల్ ప్లాంట్, హీరో మోటార్స్, ఆమ్కా డిఫెన్స్ ఫైటర్ జెట్ ప్లాంట్ (స్టెల్త్ యుద్ధ విమానం) వంటి భారీ పరిశ్రమలు వస్తున్నాయని, ఇక్కడ తయారైన ఎన్‌ఫీల్డ్ బుల్లెట్‌లు దేశమంతా తిరుగుతాయని అన్నారు. రూ.40 వేల కోట్ల ప్రభుత్వ, రూ.60 వేల కోట్ల ప్రైవేట్ పెట్టుబడులతో రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దుతామని ప్రకటించారు.ఈ ఏడాది ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో 22 శాతం వర్షపాతం తక్కువగా నమోదైందని, ఈ నేపథ్యంలో నీటి భద్రత కోసం 'జలధార' కార్యక్రమాన్ని ప్రారంభించామని చంద్రబాబు తెలిపారు. వర్షపు నీటిని భూగర్భ జలాలుగా మార్చుకోవడం ద్వారానే నీటి భద్రత సాధ్యమవుతుందని పిలుపునిచ్చారు. ఈ దిశగా 18 కిలోమీటర్ల ఫీడర్ ఛానల్, చెక్‌డ్యామ్‌లు నిర్మించిన నంద్యాల జిల్లా యంత్రాంగాన్ని ఆయన అభినందించారు.


# కడియంది కపట బుద్ధి..

మొదటి పేజీ రువాయి

మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే కడియం శ్రీహరి మధ్య విభేదాలు మరింత తీవ్రమయ్యాయి. ఈ వ్యవహారంపై పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్‌ను కలిసిన సురేఖ తన అభ్యంతరాలను వివరించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా రాజకీయాలపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ కడియంపై చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు.టీవీ9తో మాట్లాడుతూ.. తాను బాధ్యతలు చూస్తున్న దేవాదాయ శాఖలోకి తనకు సమాచారం ఇవ్వకుండా కడియం వచ్చి కమిషనర్‌తో సమీక్ష నిర్వహించారని సురేఖ ఆరోపించారు. ఏ పౌరుడైనా శాఖ కార్యాలయానికి వచ్చి వినతిపత్రం ఇవ్వొచ్చని, కానీ సమీక్షలు నిర్వహించడం మాత్రం తన శాఖను హైజాక్ చేసినట్టేనని వ్యాఖ్యానించారు. మంత్రి, ఎమ్మెల్యే బాధ్యతల మధ్య తేడా తెలుసుకోవాలని కడియానికి సూచించారు.ఈ సందర్భంగా కడియంపై సురేఖ వ్యక్తిగత విమర్శలు కూడా చేశారు. తాను సీనియర్‌నని, ఎన్నోసార్లు మంత్రిగా పనిచేశానని చెప్పుకుంటారని ఎద్దేవా చేశారు. గతంలో బీఆర్ఎస్ టికెట్‌పై పోటీ చేసి తర్వాత కాంగ్రెస్‌లో చేరిన వ్యక్తి ఇప్పుడు నీతి గురించి మాట్లాడటం సరికాదని విమర్శించారు.తాను కేవలం వినతిపత్రం మాత్రమే ఇచ్చానని, అపార్థం జరిగిందని కడియం చెప్పిన వివరణను కూడా సురేఖ ఖండించారు. సమీక్ష నిర్వహించి అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్లు కడియమే ప్రెస్‌నోట్ విడుదల చేశారని చెప్పారు. ఈ విషయాన్ని ఇప్పటికే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లామని, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్‌కు కూడా వివరించినట్లు వెల్లడించారు.కడియం కపట బుద్ధితో వ్యవహరిస్తున్నారని సురేఖ ఆరోపించారు. ఎదుటివారి ఎదుగుదలనుఆయన సహించరని విమర్శించారు. గతంలో ఉప ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తి ఇప్పుడు సాధారణ ఎమ్మెల్యేగా ఉండటం జీర్ణించుకోలేకపోతున్నారని అన్నారు. ఆయన కాంగ్రెస్‌లో చేరిన తర్వాతే గ్రూపు రాజకీయాలు పెరిగాయని ఆరోపించారు.మరోవైపు కడియం-సురేఖ వివాదాన్ని పరిష్కరిస్తామని మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. దీనిపై త్వరలోనే ఓ నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు.

# మనవడి కోసం పూరీలు చేసిన సీఎం రేవంత్ రెడ్డి..

మొదటి పేజీ రువాయి



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన మనవడిపై ఉన్న మమకారాన్ని చాటుకున్నారు. నిత్యం రాజకీయ వ్యవహారాలు, ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలతో ఎంతో బిజీగా గడిపే ఆయన, కాసేపు ముఖ్యమంత్రి హోదాను పక్కన పెట్టి మనవడి కోరికను నెరవేర్చారు. స్వయంగా పూరీలు చేసి మనవడికి అందించారు. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.ఈ వీడియోలో రేవంత్ రెడ్డి తన మనవడితో కలిసి ఉల్లాసంగా గడుపుతూ కనిపించారు. పూరీలు కావాలని మనవడు కోరడంతో, రేవంత్ రెడ్డి స్వయంగా పిండిని ఒత్తి, నూనెలో వేయించి సిద్ధం చేశారు. ఈ వీడియోను షేర్ చేస్తూ ఒక హృద్యమైన క్యాప్షన్‌ను కూడా జోడించారు. "మనవడు అడిగితే కాదనగలనా? నిరంతరం ప్రజా సేవలో తలమునకలై ఉండే జీవితంలో మనవడితో కలిసి పూరీలు చేసిన ఈ మధుర క్షణాలు మరువలేనివి" అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు.రాజకీయాల్లోని ఒత్తిడి నుంచి ఉపశమనం పొందేందుకు కుటుంబ సభ్యులతో, ముఖ్యంగా మనవడితో గడిపే సమయమే తనకు ఎంతో ఊరటనిస్తుందని రేవంత్ రెడ్డి గతంలో పలు సందర్భాల్లో తెలిపారు. తాజా వీడియో ఆయన వ్యక్తిగత జీవితంలోని సున్నితమైన కోణాన్ని, ఒక నాయకుడిలోని తాత ప్రేమను ఆవిష్కరించింది. నిత్యం రాజకీయ వివాదాలు, చర్చలతో ఉండే వాతావరణంలో ఇటువంటి ఆత్మీయ దృశ్యాలు ప్రజలను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

# ఆస్తి సంబంధిత నేరాల నియంత్రణకు జిల్లా పోలీసు శాఖ ప్రత్యేక ప్రణాళిక

**అధికంగా నేరాలు జరుగుతున్న ప్రాంతాల్లో నాకాబందీ, చెక్‌పోస్టుల నిర్వహణ.**

**ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్ల వద్ద ప్రత్యేక నిఘా కోసం పలు ప్రత్యేక బృందాల ఏర్పాటు.**

**మల్కాపూర్ చౌరస్తా చెక్‌పోస్టును ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 09, సంగారెడ్డి జిల్లా ప్రతినిధి :** కొండాపూర్ మండలం, మల్కాపూర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును మద్యరాత్రి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. చెక్‌పోస్టు వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బందితో మాట్లాడి, వాహనాల తనిఖీలు పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో అనుమానాస్పద వాహనాలు, వ్యక్తుల కదలికలపై అప్రమత్తంగా ఉండాలని, విధి నిర్వహణలో నిరంతరం జాగ్రత్తగా వ్యవహరించాలని, ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఒక ప్రకటనలో మాట్లాడుతూ, ఆస్తి సంబంధిత నేరాలను అరికట్టేందుకు సంగారెడ్డి జిల్లా పోలీసు శాఖ ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తోందని తెలిపారు. ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా అధికంగా నేరాలు జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి, అక్కడ కట్టుదిట్టమైన నిఘా, వాహనాల తనిఖీలు, అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై ప్రత్యేక పర్యవేక్షణ చేపడుతున్నామని పేర్కొన్నారు. జిల్లాలో అధికంగా నేరాలు నమోదవుతున్న ప్రాంతాలు, ప్రధాన రహదారులు, గ్రామీణ – పట్టణ అనుసంధాన మార్గాలు, అలాగే జిల్లా ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్ల వద్ద ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి, నాకాబందీ నిర్వహించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పలు ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేసి, రాత్రి బీట్‌లు, వాహనాల తనిఖీలు, అనుమానాస్పద వ్యక్తుల గుర్తింపు, పాత



నేరస్తుల కదలికలపై నిఘాను మరింత కట్టుదిట్టం చేసినట్లు వెల్లడించారు. నేరాల నియంత్రణలో, అలాగే జరిగిన నేరాలను చేధించడంలో కీలకంగా ఉపయోగపడే సీసీటీవీ కెమెరాల ఏర్పాటుకు ప్రజలు, వ్యాపారులు, షాప్ యజమానులు ముందుకు రావాలని జిల్లా ఎస్పీ కోరారు. జిల్లాలో అపరిచిత వ్యక్తులు, అనుమానాస్పద వాహనాలు, రాత్రివేళల్లో అనుమానాస్పద కదలికలు గమనించిన వెంటనే సమీప పోలీసు స్టేషన్‌కు లేదా డయల్ 100/112కు సమాచారం అందించాలని సూచించారు.

# శ్రీశ్రీశ్రీ శిరిడి పుష్కర ద్వారకా సాయిబాబా మందిరంలో గురువారం సందర్భంగా అన్న ప్రసాద వితరణ కార్యక్రమం

**సాయిబాబా వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన వల్లూరిపల్లి వంశీ కృష్ణ, విజయరేణుక దంపతులు**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 09, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపాడు మండలం, సారపాక లోని శ్రీశ్రీశ్రీ శిరిడి పుష్కర ద్వారకా సాయిబాబా వారి మందిరంలో గురువారం సందర్భంగా అన్న ప్రసాద వితరణ కార్యక్రమం ప్రత్యేక ప్రజలు నిర్వహించారు, సాయి బాబా వారికి ఉదయం అభిషేకము, పూల అలంకరణ, హారతి, భజన కార్యక్రమం, మధ్యాహ్నం హారతి, అనంతరం అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో అన్న ప్రసాద వితరణ దాత వల్లూరిపల్లి వంశీ కృష్ణ,విజయరేణుక దంపతులు మాజీ ఎంపీటీసీ, ఇరవైండి పాల్గొని బాబా వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారి దంపతులకు ఆలయ కమిటీ వారు శాలువా పూలదండలతో చిరు సన్మానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా వంశీకృష్ణ మాట్లాడుతూ సాయిబాబా వారిని దర్శించుకోవడం పూజలు నిర్వహించడం చాలా సంతోషంగా ఉందన్నారు. సాయిబాబా ఊరేగింపు రథం కొరకు కొన్ని రోజుల క్రితం ఆలయ కమిటీ వారు మమ్మల్ని సంప్రదించారు. ఈ విషయమై తాళ్లూరి పంచాక్షరయ్య కుమారుడు తాళ్లూరు జయశేఖర్, నీలిమ దంపతులు తానా మాజీ అధ్యక్షులు యూఎస్ఏ వారు, సాయిబాబా వారి ఊరేగింపు రదమునకు ఎంత ఖర్చవుతుందో సుమారు 3,50,000 మొత్తము వారు ఇస్తామని ప్రకటించడం జరిగిందన్నారు. అందులో భాగంగా రెండు లక్షల రూపాయలు మా దంపతుల ద్వారా ఆలయ కమిటీ వారికి అందించడం జరిగింది అన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం బాబా వారి ఊరేగింపుకు రథం లేక



అనేక ఇబ్బందులు పడుతున్నామని ఈ విషయమై తాళ్లూరి జయ శేఖర్, వల్లూరిపల్లి వంశీ కృష్ణ, ను సంప్రదించడం జరిగిందని, వారు సానుకూలంగా స్పందించి 3,50,000తో ఊరేగింపు రథం తయారు చేయించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు వారికి సాయిబాబా వారి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు, మహిళలు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## రామవరం అర్బన్ హెల్త్ సెంటర్‌లో

# రాష్ట్రస్థాయి అధికారుల ఆకస్మిక తనిఖీ

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 09, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రామవరంలోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ ను రాష్ట్రస్థాయి ఉన్నతాధికారుల బృందం గురువారం నాడు సందర్శించింది. కేంద్రంలో రోగులకు అందుతున్న వైద్య సేవలు, మౌలిక వసతుల నాణ్యతను ఈ బృందం క్షుణ్ణంగా పరిశీలించింది. రికార్డుల క్షుణ్ణ పరిశీలన.. సేవలపై ఆరా హైదరాబాద్‌లోని రీజినల్ ఆఫీస్ ఫర్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ పబ్లిక్ హెల్త్ స్పెషలిస్ట్ డాక్టర్ వరుణ్ విజయ్ గైకి ఈ తనిఖీల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఆసుపత్రిలోని ప్రతి విభాగాన్ని సందర్శించి, రికార్డులను నిశితంగా పరిశీలించారు. ప్రతి వారం గర్భిణీ స్త్రీలకు అందిస్తున్న వైద్య సేవలు, వారికి జరుగుతున్న ఉచిత పరీక్షల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఏఎంసి రిజిస్ట్రేషన్లు, ఈడీడీ రిజిస్టర్లను చెక్ చేసి, ఇప్పటివరకు జరిగిన ప్రసవాల గణాంకాలను అంచనా వేశారు. టీబీ (క్షయ), లెప్రసీ (కుష్టు) వ్యాధిగ్రస్తుల వివరాలను, వారికి అందిస్తున్న ఉచిత మందుల పంపిణీ తీరును సమీక్షించారు. రోగులకు రక్తపోటు (బి.పి) పరీక్షించే విధానాన్ని ప్రత్యక్షంగా పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆసుపత్రిలో పారిశుద్ధ్య నిర్వహణ, బయో మెడికల్ వ్యర్థాల సురక్షిత డిస్పోజల్ విధానంపై సంతృప్తి వ్యక్తం చేశారు. నాణ్యమైన వైద్యమే లక్ష్యం ప్రభుత్వ నిబంధనల ప్రకారం పేద ప్రజలకు నాణ్యమైన కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేయాలని డాక్టర్ వరుణ్ విజయ్ సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలని ఆదేశించారు. ఈ ఉన్నతాధికారుల బృందంలో క్వాలిటీ మేనేజర్ శృతి, హెల్త్ ఎడ్యుకేటర్ రాంప్రసాద్, ప్రోగ్రామ్ ఆఫీసర్




సలిత ఉన్నారు. అలాగే ఈ తనిఖీ కార్యక్రమంలో రామవరం హెల్త్ సెంటర్ నర్సింగ్ ఆఫీసర్ శంకరమ్మ, పీహెచ్ఎం శ్రీనివాసరావు, ల్యాబ్ టెక్నీషియన్ స్పందన, డీఈఓ స్ఫూర్తి, ఏఎన్ఎంలు రాజేశ్వరి, శ్రీలక్ష్మి తదితర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# టీపీటీ బకాయిలపై తెలంగాణ హైకోర్టు సీరియస్

**ఆర్థిక శాఖ కార్యదర్శి కోర్టుకు హాజరు కావాలని ఆదేశాలు జారీ**

**మాజీ కంటోన్మెంట్ బోర్డు ఉపాధ్యక్షుడు రామకృష్ణ వెల్లడి**

**మహీంద్రా హిల్స్, జూలై 09,హైదరాబాద్ పల్స్ ప్రతినిధి :**
కంటోన్మెంట్ బోర్డుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన టీపీటీ బకాయిల వ్యవహారంపై తెలంగాణ హైకోర్టు రాష్ట్ర ఆర్థిక శాఖ కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా కోర్టుకు హాజరు కావాలని ఆదేశాలు జారీ చేసినట్లు మాజీ కంటోన్మెంట్ బోర్డు ఉపాధ్యక్షుడు రామకృష్ణ తెలిపారు. కంటోన్మెంట్ బోర్డుకు గత కొన్ని సంవత్సరాలుగా టీపీటీ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే విడుదల చేయాలని కోరుతూ తాను ఇటీవల హైకోర్టును ఆశ్రయించినట్లు చెప్పారు. ఈ పిటిషన్‌పై హైకోర్టు శు



క్రవారం విచారణ చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా రామకృష్ణ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కంటోన్మెంట్ ప్రాంత అభివృద్ధిని గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేశాయని ఆరోపించారు. రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి కంటోన్మెంట్ అభివృద్ధిపై ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేదని విమర్శించారు. ఇప్పటివరకు కేంద్ర ప్రభుత్వ నిధులతోనే కంటోన్మెంట్‌లో అభివృద్ధి పనులు జరిగాయని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం టీపీటీ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, అలాగే కేంద్రం నుంచి రావాల్సిన సర్వీస్ ఛార్జీల విడుదల కోసం ఇప్పటికే పలుమార్లు ఢిల్లీలో సంబంధిత అధికారులను కలిసి వినతిపత్రాలు సమర్పించినట్లు తెలిపారు. కంటోన్మెంట్‌లో ప్రస్తుతం ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (సర్ ) ప్రక్రియ నిలిచిపోయిందని, బీ.ఎల్.ఓలకు పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించి ఎస్.ఐ.ఆర్ ప్రక్రియను సజావుగా కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని రామకృష్ణ డిమాండ్ చేశారు

# తెలంగాణ ఉద్యమ కారుల సంఘం తుర్కపల్లి మండల అధ్యక్షునిగా కోట సురేష్ నియామకం



**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 09, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** తెలంగాణ రాష్ట్ర ఉద్యమ కారుల సంఘం తుర్కపల్లి మండల అధ్యక్షునిగా మండల కేంద్రానికి చెందిన కోట సురేష్ ని నియమించినట్లు తెలంగాణ రాష్ట్ర ఉద్యమ కారుల సంఘం రాష్ట అధ్యక్షుడు పూస శ్రీనివాస్ తెలిపారు. తుర్కపల్లి మండల మాజీ జేఏసీ చైర్మెన్ తెలంగాణ ఉద్యమ కారుడు ఎరుకల వెంకటేష్ గౌడ్ అధ్యక్షతన గురువారం రోజు తుర్కపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కోట సురేష్ కు నియామక పత్రాన్ని అందజేసిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో క్రియాశీలకంగా పాల్గొన్న ప్రతి ఉద్యమ కారునికి 250 గజాల ఇంటి స్థలంతో పాటు 30 వేల రూపాయల పింఛన్ సౌకర్యంతో పాటు ప్రతి ఉద్యమ కారునికి గుర్తింపు కార్డులు ఇచ్చి గౌరవించాలని డిమాండ్ చేశారు. ప్రతి ఒక్క ఉద్యమ కారునికి న్యాయం జరిగే వరకు ఉద్యమిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యమ కారుల సంఘం జిల్లా అధ్యక్షుడు జైపాల్ రెడ్డి, రాష్ట ప్రధాన కార్యదర్శి జంపాల శ్రీనివాస్ జిల్లా అధ్యక్షురాలు సీస మహేశ్వరి నాయకులు, బండారి శ్రీను దేవరుప్పల మల్లేష్, ధ్యాన బోయిన బొందయ్య, కరుణాకర్, నవీన్, కొడారి పరమేశ్, రాజు, కేదారి తదితరులు ఉన్నారు

# మంత్రి తుమ్మలను కోరిన తాటి.. పెద్దవాగు ప్రాజెక్ట్ ఆయకట్టుదారులను ఆదుకోండి



**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 09, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :**
పెద్దవాగు ప్రాజెక్ట్ గండిపడడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆయకట్టు రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు తాటి వెంకటేశ్వర్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కోరారు. దమ్మపేట మండలం గండుగులపల్లి గ్రామంలోని తన నివాసంలో ఆయన మాట్లాడుతూ, పెద్దవాగు ప్రాజెక్ట్ దెబ్బతినడంతో ఆయకట్టు రైతులు వరుసగా మూడు పంట సీజన్లుగా తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ముఖ్యమంత్రి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చర్చించి, పెద్దవాగు ప్రాజెక్ట్ మరమ్మత్తు పనులను అత్యవసరంగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా, పెద్దవాగు ప్రాజెక్ట్ ఆయకట్టు రైతులతో కలిసి త్వరలోనే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును కలిసి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, సాగునీటి ఇబ్బందులను నేరుగా వివరించనున్నట్లు తాటి వెంకటేశ్వర్లు తెలిపారు.

# భద్రాద్రి జిల్లా ఎస్సీ సెల్ జనరల్ సెక్రటరీగా రాసమల్ల రాము నియామకం

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 09, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్సీ సెల్ జనరల్ సెక్రటరీగా భద్రాచలం పట్టణానికి చెందిన రాసమల్ల రామును



నియమించారు. ఈ సందర్భంగా ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ గద్దల రమేష్ ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. నియామకం అనంతరం రాసమల్ల రాము మాట్లాడుతూ తనపై విశ్వాసం ఉంచి కీలక బాధ్యతలు అప్పగించిన జిల్లా చైర్మన్ గద్దల రమేష్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే తన నియామకానికి సహకరించిన మెహబూబాబాద్ పార్లమెంట్ సభ్యుడు పోరిక బలరాం నాయక్, భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు భోగాల శ్రీనివాస్ రెడ్డి, భద్రాచలం సర్పంచ్ పూనెం కృష్ణలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ పార్టీ బలోపేతానికి, ఎస్సీ సెల్ అభివృద్ధికి కృషి చేస్తానని రాసమల్ల రాము పేర్కొన్నారు.

# చెరువులోకి మురుగునీటి పైప్‌లైన్..?

**అనుమతులు లేకుండానే నాలుగు అంతస్తుల భవన నిర్మాణమా..?**

**రేణిగుంట చెరువుకు ముప్పంటున్న స్థానికులు.**

**విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్.**

**శామీర్‌పేట, జూలై 09,హైదరాబాద్ పల్స్ ప్రతినిధి :** చెరువుల పరిరక్షణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తున్న నేపథ్యంలో అలియాబాద్ మున్సిపల్ పరిధిలోని మురారిపల్లి గ్రామంలో ఓ నిర్మాణ వ్యవహారం వివాదాస్పదంగా మారింది. అనుమతులకు విరుద్ధంగా నాలుగు అంతస్తుల భవనం నిర్మిస్తున్నారని, అదే భవనం నుంచి వెలువడే మురుగునీటిని నేరుగా రేణిగుంట చెరువులోకి మళ్లించేలా భారీ డ్రైనేజీ పైప్‌లైన్ ఏర్పాటు చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులు స్పందించకపోవడంపై గ్రామస్థులు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు.స్థానిక కౌన్సిలర్ యూసుఫ్ బాబా మాట్లాడుతూ భవన నిర్మాణానికి అవసరమైన పూర్తి అనుమతులు లేకుండానే పనులు కొనసాగుతున్నాయని, ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్ శాఖల అనుమతులు లేకుండానే చెరువులోకి మురుగునీటిని మళ్లించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. దీనివల్ల చెరువు కాలుష్యానికి గురయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.ఇదే భవన యజమానిపై గతంలో ప్రభుత్వ బోరు నీటిని ట్యాంకర్ల ద్వారా విక్రయించారనే ఆరోపణలు వచ్చినట్లు స్థానికులు పేర్కొన్నారు. అప్పట్లో అధికారులకు ఫిర్యాదు చేయడంతో ఆ వ్యవహారాన్ని నిలిపివేసినట్లు తెలిపారు. ఇప్పుడు మళ్లీ చెరువులోకి డ్రైనేజీ పైప్‌లైన్ ఏర్పాటు చేస్తున్నారనే ఆరోపణలు రావడం అధికార యంత్రాంగం పనితీరుపై సందేహాలకు తావిస్తోందని విమర్శించారు. ఒకప్పుడు ఐదు ఎకరాలకు పైగా విస్తీర్ణంలో ఉన్న రేణిగుంట చెరువు ప్రస్తుతం ఆక్రమణల కారణంగా రెండెకరాలకు పరిమితమైందని స్థానికులు ఆరోపిస్తున్నారు. చెరువు పూర్తి స్థాయి నీటి మట్టం (ఎఫ్‌టీఎల్) హద్దులను గుర్తించి శాశ్వత రక్షణ చర్యలు చేపట్టాలని పలుమార్లు అధికారులను కోరినా ఫలితం లేకపోయిందని తెలిపారు. ఈ వ్యవహారంపై ఇరిగేషన్, మున్సిపల్, రెవెన్యూ శాఖలు సంయుక్తంగా విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి





తీసుకురావాలని, నిబంధనల ఉల్లంఘనలు జరిగి ఉంటే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు, ప్రజాప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు.

# మంత్రి దామోదర్ రాజనర్సింహ నారాయణఖేడ్ నియోజకవర్గ పర్యటన

**50 లక్షలతో గ్రంథాలయ నిర్మాణానికి శంకుస్థాపన**

**కంగ్టి మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని స్థానిక ఎమ్మెల్యే డా.సంజీవరెడ్డి తో పరిశీలన.**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జులై 09, నారాయణ ఖేడ్ :** రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ నారాయణఖేడ్ నియోజకవర్గం లోని కంగ్టి మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ను అకస్మికంగా పరిశీలించారు. నారాయణఖేడ్ నియోజకవర్గం లోని సంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో 50 లక్షల రూపాయలతో నిర్మిస్తున్న శాఖ గ్రంథాలయానికి స్థానిక శాసనసభ్యులు డా సంజీవరెడ్డి తో కలిసి శంకుస్థాపన చేశారు.అనంతరం పర్యటనలో భాగంగా కంగ్టి మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. స్థానిక శాసనసభ్యులు డాక్టర్ సంజీవరెడ్డి సూచనల మేరకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 6 పడకల ఆసుపత్రి నుండి 30 పడకల ఆసుపత్రి గా (సి యస్ సి) స్థాయిని పెంచాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని అన్ని విభాగాలను పరిశీలించారు. ఆస్పత్రి ఒపీ, ఐపీ, డాక్టర్లు, సిబ్బంది వివరాలను డి యమ్ యాచ్ ఓ ను అడిగి తెలుసుకున్నారు. స్థానిక శాసనసభ్యులు సంజీవరెడ్డి చేసిన విజ్ఞప్తిపై మంత్రి



దామోదర్ రాజనర్సింహ సానుకూలంగా స్పందించారు. అలాగే నిజాంపేట పీహెచ్ సి ని 24/7 ఆస్పత్రిగా స్థాయి పెంచాలని మంత్రి డి యమ్ యాచ్ ఓ ను ఆదేశించారు.

# ఆలేరు నియోజకవర్గ పిఎసిఎస్ నూతన పాలకమండలి నియామకం

## రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 09, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గ పరిధిలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పిఏసిఎస్) నూతన పాలక మండళ్లను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. రైతు సంక్షేమం, సహకార వ్యవస్థ బలోపేతం, వ్యవసాయ రంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తూ ఈ నియామకాలు చేపట్టినట్లు ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య తెలిపారు.

**ఆలేరు నియోజకవర్గంలోని వివిధ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు నూతనంగా నియమితులైన చైర్మన్లు:**

బొమ్మలరామారం మండలం – సింగిర్తి మల్లేశం.
తుర్కపల్లి మండలం – ధనావత్ శంకర్ నాయక్.
యాదగిరిగుట్ట మండలం – చీర శ్రీశైలం.
రాజపేట మండలం – నమిల మహేందర్.
ఆలేరు మండలం – జనగాం ఉపేందర్ రెడ్డి.
ఆత్మకూరు మండలం – యాస లక్ష్మారెడ్డి.
గుండాల మండలం – అండెం సంజీవరెడ్డి.

ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మాట్లాడుతూ, రైతు సంక్షేమాన్ని ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని సహకార సంఘాల ద్వారా రైతులకు మరింత మెరుగైన సేవలు అందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ నియామకాలు చేపట్టిందన్నారు.ఈ నియామకాలకు ఆమోదం తెలిపిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డికి, సహకార శాఖ మంత్రికి, రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.అలాగే నూతనంగా నియమితులైన చైర్మన్లు, డైరెక్టర్లు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ రైతుల సంక్షేమానికి అంకితభావంతో పనిచేయాలని ఆకాంక్షించారు. రైతులకు ఎరువులు, విత్తనాలు, పంట రుణాలు, ఇతర సహకార సేవలను పారదర్శకంగా అందించి సహకార సంఘాలను మరింత బలోపేతం చేయాలని సూచించారు.నూతనంగా బాధ్యతలు చేపట్టనున్న పిఏసిఎస్ చైర్మన్లు, డైరెక్టర్లందరికీ ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి పదవీకాలంలో రైతులకు విశిష్ట సేవలు అందించాలని ఆకాంక్షించారు.



# ప్రజా సాంస్కృతిక ఉద్యమానికి దిక్సూచిగా నిలిచిన అరుణోదయ నాగన్నకు ఘన నివాళి

హైదరాబాద్ పల్స్, జూలై 09, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి:


ప్రజా సాంస్కృతిక ఉద్యమంలో తన పాటలతో ప్రజలను చైతన్యపరిచిన విప్లవ గాయకుడు, సిపిఐ(ఎం-ఎల్) న్యూ డెమోక్రసీ రాష్ట్ర నాయకులు కామ్రేడ్ అరుణోదయ నాగన్న స్మృతిని చిరస్థాయిగా నిలబెట్టాలని పలువురు నాయకులు పిలుపునిచ్చారు. డోర్నకల్ మండలం చిలుకోడు గ్రామ కేంద్రంలో గురువారం నిర్వహించిన సంతాప సభలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. గ్రామ కార్యదర్శి కామ్రేడ్ బాలెం వెంకటేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎం-ఎల్) న్యూ డెమోక్రసీ మహబూబాబాద్ జిల్లా కమిటీ సభ్యులు కామ్రేడ్ లింగన్న మాట్లాడుతూ, ప్రజా కళారూపాలను సామాజిక మార్పుకు ఆయుధాలుగా మలిచిన అరుదైన సాంస్కృతిక యోధుడు నాగన్న అని కొనియాడారు. వ్యక్తిగత జీవితంలో ఉన్నత అవకాశాలు వచ్చినప్పటికీ వాటిని వదులుకొని పేదలు, రైతులు, కూలీల పక్షాన నిలిచి జీవితాంతం ప్రజా ఉద్యమాలకు అంకితమయ్యారని తెలిపారు. నాగన్న తన పాటల ద్వారా అణగారిన వర్గాల కష్టాలను ప్రజల ముందుకు తీసుకువచ్చి, అన్యాయాలపై పోరాట స్ఫూర్తిని రగిలించారని పేర్కొన్నారు. ఆయన భౌతికంగా లేకపోయినా, ఆయన గీతాలు, ఆశయాలు, ప్రజా ఉద్యమాల పట్ల చూపిన నిబద్ధత తరతరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని అన్నారు. ప్రజల హక్కుల సాధన కోసం ఆయన చూపిన మార్గంలో ఉద్యమాలను మరింత బలోపేతం చేయడమే నిజమైన నివాళి అవుతుందని పేర్కొన్నారు. జూలై 12న మహబూబాబాద్‌లో నిర్వహించనున్న కామ్రేడ్ నాగన్న సంస్మరణ సభను ప్రజలు, కళాకారులు, ప్రజాసంఘాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ప్రగతిశీల యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు కామ్రేడ్ సామ పాపయ్య, అఖిల భారత రైతు కూలీ సంఘం డోర్నకల్ మండల కార్యదర్శి కామ్రేడ్ కర్ణం చిలుకా రెడ్డి, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య



జిల్లా నాయకుడు నాగు బండి భాస్కర్ మాట్లాడుతూ నాగన్న ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కట్టుబడి పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు గుండు నాగన్న, చింతల వాసయ్య, చాతరాజుపల్లి మల్లయ్య, రాసాల ఎల్లయ్య, గుండు శ్రీను, బిక్షం, తాళ్లూరి వెంకటేశ్వర్లు, యాస రాఘవేందర్, యాస పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

# మడ్‌ఫోర్ట్‌లో శ్రీ దుర్గా భవానిమాత ఆలయ 16వ వార్షికోత్సవం

**ఆలయంలో అభిషేకం, హోమం,మహా హారతి, అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు**




**సికింద్రాబాద్, జూలై 09, హైదరాబాద్ పల్స్ ప్రతినిధి :** సికింద్రాబాద్ కంటోన్మెంట్ మడ్‌ఫోర్ట్‌లోని జీఈ (యుటిలిటీ) కార్యాలయ ఆవరణలో ఉన్న శ్రీ దుర్గాభవాని మాత ఆలయం 16వ వార్షికోత్సవ వేడుకలు గురువారం భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఉదయం ఆరు గంటలకు అభిషేకం, ఏడు గంటలకు హోమం, అనంతరం ఉదయం ఎనిమిది గంటల ముప్పై నిమిషములకు మహా హారతి, తీర్థప్రసాద వితరణ నిర్వహించారు. మధ్యాహ్నం పన్నెండు గంటల నుంచి భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. వార్షికోత్సవ మహోత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీ దుర్గాభవాని మాతను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీర్వాదాలు పొందారు. ఆలయ ప్రాంగణం భక్తుల రాకతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో జీఈ (యుటిలిటీ) మేజర్ దేవేందర్ సింగ్, సీడబ్ల్యూ ఆర్మీ--1, ఆర్మీ--2, జీఈ సౌత్, జీఈ నార్త్‌కు చెందిన అధికారులు, ఉద్యోగులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

# రాష్ట్ర వ్యాప్త విద్యా సంస్థల బంద్‌కు పీడీఎస్యూ పిలుపు

**జహీరాబాద్‌లో అవగాహన సదస్సు, ఎంఈఓ సస్పెన్షన్ డిమాండ్**







**హైదరాబాద్ పల్స్ న్యూస్, జులై 09, జహీరాబాద్:** ప్రభుత్వ విద్యా వ్యవస్థను కాపాడాలని, ప్రైవేట్ విద్యా సంస్థల అక్రమాలను అరికట్టాలని డిమాండ్ చేస్తూ ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం - పీడీఎస్యూ నేడు జులై 10, శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా విద్యా సంస్థల బంద్‌కు పిలుపునిచ్చింది.ఈ సందర్భంగా గురువారం జహీరాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పీడీఎస్యూ డివిజన్ అధ్యక్షులు ఎం.డి ఇస్మాయిల్ అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని, మూతపడుతున్న 23 వేల పాఠశాలల నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు.జహీరాబాద్‌లో గుర్తింపు లేకుండా నడుస్తున్న స్కూల్స్ పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా అడ్మిషన్లు తీసుకుంటూ విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటున్నారని ఆరోపించారు.ఈ విషయంలో ఉదాసీనంగా వ్యవహరిస్తున్న జహీరాబాద్ మండల విద్యాధికారి మాణయ్యను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అవినీతికి పాల్పడి విద్యను వ్యాపారంగా మారుస్తున్నారని విమర్శించారు. డిమాండ్లు నెరవేరని పక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.కార్యక్రమంలో పీడీఎస్యూ డివిజన్ కార్యదర్శి ఈ.గోపాల్, రాకేష్, స్వాతి, కుమార్, నరసింహులు, ప్రమీల, రాజు, ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.

విలేకరులు కావలెను
హైదరాబాద్ పల్స్
జాతీయ తెలుగు దినపత్రిక
"ఎంతకైనా తెగిస్తాం... ప్రజల గొంతుకై నిలుస్తాం" అనే నినాదంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రారంభించిన హైదరాబాద్ పల్స్ జాతీయ దినపత్రికకు తెలుగు రాష్ట్రాలలోని అన్ని మండల, నియోజకవర్గాల, జిల్లాల వ్యాప్తంగా విలేకరులు కావలెను. * సీనియర్లకు ప్రాధాన్యత కలదు.
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్స్
- Dr. RAHUL KUMAR 9989834020
- K. Naveen Kumar 94406 53413
www.hyderabadpulse.com HyderabadPulse @hyderabad

# నైపుణ్యాభివృద్ధితో ఆర్థిక స్వావలంబన సాధించాలి....


## సెర్ప్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ బాలస్వామి.




**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 09, తెలంగాణ బ్యూరో :** సిద్ధిపేటలోని యూనియన్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ (యూనియన్ ఆర్ సేటి ) లో నిర్వహిస్తున్న బ్యాచ్ శిక్షణ కార్యక్రమం ఉత్సాహంగా కొనసాగుతోంది. ఈ కార్యక్రమానికి సెర్ప్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ బాలస్వామి, జేపీఈ రామస్వామి ముఖ్య అతిథులుగా హాజరై శిక్షణ పొందుతున్న అభ్యర్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నైపుణ్యాభివృద్ధి ద్వారా స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా స్వావలంబన సాధించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, మహిళల ఆర్థిక సాధికారత, కుటుంబాల జీవన ప్రమాణాల మెరుగుదలలో ఇటువంటి శిక్షణ కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను గ్రామస్థాయిలో అమలు చేస్తూ ఆర్థిక అక్షరాస్యతపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని అభ్యర్థులకు సూచించారు. శిక్షణ కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ఆర్ సేటి డైరెక్టర్ గేము నాయక్, డీపీఎం విద్యాసాగర్ పాల్గొని శిక్షణ కార్యక్రమం లక్ష్యాలు, ప్రాముఖ్యతను వివరించారు. అలాగే సంస్థ సిబ్బంది నాగరాజు, నజీమ్ అలీ, స్వప్న, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# 80.9 శాతానికి పెరిగిన భారతదేశ అక్షరాస్యత రేటు

## 98.2 శాతంతో మిజోరాం టాప్.. 72.6 శాతంతో ఆంధ్రప్రదేశ్ చివరి స్థానం!




**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 09, సెంట్రల్ బ్యూరో :** దేశవ్యాప్తంగా విద్యా ప్రమాణాలు, అక్షరాస్యతను పెంపొందించేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న వివిధ రకాల విద్యా సంస్కరణలు సత్ఫలితాలనిస్తున్నాయి. నేషనల్ శాంపిల్ సర్వే ఆఫీస్ నిర్వహించిన తాజా 'పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే' వార్షిక నివేదిక ప్రకారం.. భారతదేశ సగటు అక్షరాస్యత రేటు గణనీయంగా మెరుగై 80.9 శాతానికి చేరుకుంది. 2011 జనాభా లెక్కల ప్రకారం ఉన్న 74 శాతం అక్షరాస్యత తో పోలిస్తే.. దేశంలో విద్యావ్యాప్తి ఎంతో వృద్ధి చెందిందని కేంద్ర విద్యా శాఖ వెల్లడించింది. అయితే, ఈ నివేదికలో పట్టణ, గ్రామీణ ప్రాంతాల మధ్య ఇప్పటికీ వ్యత్యాసాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. పట్టణ ప్రాంతాల్లో అక్షరాస్యత రేటు అత్యధికంగా 90 శాతంగా నమోదు కాగా, గ్రామీణ ప్రాంతాల్లో ఇది కేవలం 77 శాతంగానే నమోదైంది.రాష్ట్రాల వారీగా అక్షరాస్యత గణాంకాలను పరిశీలిస్తే..ఈశాన్య రాష్ట్రమైన మిజోరాం 98.2 శాతం అక్షరాస్యతతో దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచి సరికొత్త రికార్డు సృష్టించింది. ఆ తర్వాతి స్థానాల్లో కేంద్రపాలిత ప్రాంతమైన లక్షద్వీప్ (97.3%), నాగాలాండ్ (95.7%), కేరళ (95.3%) నిలిచాయి. కాగా, దేశంలోనే అత్యంత తక్కువ అక్షరాస్యత రేటుతో ఆంధ్ర ప్రదేశ్ (72.6%) చివరి స్థానంలో నిలవడం ఆందోళన కలిగిస్తోంది. ఏపీ తర్వాత స్థానాల్లో బీహార్ (74.3%), మధ్యప్రదేశ్ (75.2%), రాజస్థాన్ (75.8%) ఉన్నాయి. ఇక తెలంగాణ రాష్ట్రం 76.9 శాతం అక్షరాస్యతను నమోదు చేసింది.

# ముత్తంగి పట్టణంలో త్రిశూల్ బార్ అండ్ రెస్టారెంట్ ఘన ప్రారంభం

## ప్రారంభించిన ఎమ్మెల్యే జిఎంఆర్




**పటాన్ చెరు, హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 09 :** సంగారెడ్డి జిల్లా ఎమ్మెల్యే జిఎంఆర్ అని పెట్టాలి పటాన్ చెరు ముత్తంగి పట్టణంలో సునీల్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన త్రిశూల్ బార్ అండ్ రెస్టారెంట్‌ను పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఘనంగా ప్రారంభించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే రిబ్బన్ కట్ చేసి రెస్టారెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా త్రిశూల్ బార్ అండ్ రెస్టారెంట్ యాజమాన్యం ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డిని శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, ముత్తంగి ప్రాంతంలో నూతనంగా ప్రారంభమైన ఈ రెస్టారెంట్ విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు. స్థానిక ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ వ్యాపార రంగంలో ముందుకు సాగాలని యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పటాన్చెరు మాజీ కార్పొరేటర్ మేట్టు కుమార్ యాదవ్, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గడీల శ్రీకాంత్ గౌడ్, స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# విద్యుత్ సేవల బలోపేతానికి ప్రాధాన్యం.. పెరుమండ్ల సంకీస ఉపకేంద్రాన్ని పరిశీలించిన విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు

**హైదరాబాద్ పల్స్, జూలై 09, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి:** గ్రామీణ ప్రాంతాల్లో నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడంతో పాటు విద్యుత్ వ్యవస్థను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు గురువారం మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం పెరుమండ్ల సంకీస గ్రామంలోని విద్యుత్ ఉపకేంద్రాన్ని సందర్శించి సమగ్రంగా పరిశీలించారు. ఉపకేంద్రంలో అందుబాటులో ఉన్న సౌకర్యాలు, నిర్వహణ తీరు, విద్యుత్ సరఫరా పరిస్థితులు, వినియోగదారులకు అందుతున్న సేవలపై అధికారులు సమీక్ష నిర్వహించారు. విద్యుత్ అంతరాయాలను తగ్గిస్తూ ప్రజలకు నిరంతర, నాణ్యమైన విద్యుత్ అందేలా అవసరమైన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో విద్యుత్ లైన్ల సామర్థ్యాన్ని పెంచేందుకు అవసరమైన మధ్యస్థ విద్యుత్ స్తంభాల మంజూరుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. వ్యవసాయ విద్యుత్ లైన్ల నిర్వహణలో నిర్లక్ష్యానికి తావులేకుండా పనిచేయాలని, రైతులు మరియు విద్యుత్ సిబ్బంది ప్రాణ భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. ప్రతి పనిని భద్రతా నిబంధనలకు అనుగుణంగా నిర్వహిస్తూ ప్రమాద రహిత సేవలు అందించాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ అధికారులు స్థానిక సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి తగిన చర్యలు చేపట్టాలని సంబంధిత సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షణ ఇంజనీర్ విజయేందర్ రెడ్డి, విభాగ ఇంజనీర్ కోటేశ్వరరావు, విభాగ సాంకేతిక అధికారి హీరాలాల్,



మీటర్ల పరీక్ష విభాగ ఇంజనీర్ సునీత, సహాయ విభాగ ఇంజనీర్ రమేష్, నిర్మాణ విభాగ సహాయ ఇంజనీర్ ఐలయ్య, సహాయ ఇంజనీర్లు కిరణ్, రమణ, శ్రేణి ఇన్‌స్పెక్టర్ జంపిరావు, లైన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌తో పాటు డోర్నకల్ విద్యుత్ విభాగ సిబ్బంది పాల్గొన్నారు.

# ఏటిసి సెంటర్ కు భూమి పూజ చేసిన మంత్రి వివేక్

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 09, జహీరాబాద్ :** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ లోని బుర్దిపాడ్ గ్రామంలో రూ.45.15 కోట్ల వ్యయంతో నిర్మించనున్న అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ కు గురువారం సాయంత్రం రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి భూమి పూజ చేసారు. జహీరాబాద్ ఎంపీ సురేష్ శెట్కార్, టీఎస్ఐఐసి చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, సెట్విన్ చైర్మన్ గిరిధర్ రెడ్డి, ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఫయుమ్ కురేషిలు హాజరయ్యారు. మంత్రి వివేక్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రేవంత్ రెడ్డి రాష్ట్రంలో 2లక్షల ఉద్యోగా లు ఇస్తామని, ఇప్పటి వరకు లక్ష ఉద్యోగాలు ఇచ్చారన్నారు. పది సంవత్సరాల టిఆర్ఎస్ పరిపాలించినా, ఐటిఐ సెంటర్లకు ఒక్క రూపాయి కూడా బడ్జెట్ ఇవ్వలేదని విమర్శించారు. ఇంటర్ చదుకున్న పిల్లలకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్న ఉదేశంతో ఈ ఏటిసి సెంటర్ లను ఏర్పాటు చేస్తున్నారని, ఈ సెంటర్ లలో చదువుకుంటున్న పిల్లలకు నెలకు 2000 రూపాయల స్టైఫండ్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఏటీసీ సెంటర్ లలో కొత్త,కొత్త కోర్సులు ఏర్పాటు చేయడం జరిగిందని, దేశంలోనే తెలంగాణ రాష్ట్రం ఏటీసీ సెంటర్స్ లలో ముందుశీదన్నారు. ఏటీసీ సెంటర్ ద్వారా బయటి దేశాలకు వెళ్లి పని చేయలనుకున్న పిల్లల కోసం టామ్కామ్ సంస్థకు ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి 90.కోట్లు నిధులు కేటాయించరని, ఈ మొత్తంతో ప్రత్యేకంగా జర్మనీ భాష నేర్పించి వారిని ఆ దేశం లో ఉద్యోగాల కోసం పంపిస్తామని తెలిపారు. ఉద్యోగ అవకాశాలు లేక పిల్లలు వేరే వేరే చెడు అలవాట్లకు పోకుండా ఈ ఏటీసీ సెంటర్ లలో చేరి



ఉద్యోగాలు సంపాదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు ఉజ్వల్ రెడ్డి, మాజీ మంత్రి చంద్రశేఖర్, మాజీ ఇండస్ట్రీస్ చైర్మన్ తన్వీర్, ప్రిన్సిపాల్ తిరుపతి రెడ్డి, ఇండస్ట్రియల్ జోనల్ మేనేజర్ విట్టల్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఢిల్లీకి 'ఏటీఎం'గా మారింది.!: జేపీ నడ్డా

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 09, తెలంగాణ డెస్క్:** తెలంగాణలో అధికారంలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై కేంద్ర మంత్రి, బీజేపీ జాతీయ మాజీ అధ్యక్షుడు జేపీ నడ్డా తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గురువారం (జూలై 9, 2026) తెలంగాణలో పర్యటించిన ఆయన.. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అవినీతిమయ పాలన సాగిస్తోందని మండిపడ్డారు. గతంలో కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం 'కాళేశ్వరం ప్రాజెక్ట్'ను తమకు ఏటీఎంలా వాడుకుంటే, ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కార్ మొత్తం తెలంగాణ రాష్ట్రాన్నే ఢిల్లీలోని తమ హైకమాండ్‌కు 'ఏటీఎం'గా మార్చేసిందని నడ్డా ఆరోపించారు. రాష్ట్ర అభివృద్ధిని పూర్తిగా అటకెక్కించి, నిధులను ఢిల్లీకి తరలిస్తున్నారని ఆయన విమర్శించారు. తెలంగాణ సమగ్ర అభివృద్ధి చెందాలంటే ఇక్కడ కూడా బీజేపీ ఆధ్వర్యంలో 'డబుల్ ఇంజన్ సర్కార్' రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

**80 కోట్ల మందికి ఆహార భద్రత:**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వ పాలనలో దేశం అన్ని రంగాల్లో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతుందని జేపీ నడ్డా స్పష్టం చేశారు. పేదరిక నిర్మూలన, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొంటూ.. దేశవ్యాప్తంగా సుమారు 80 కోట్ల మంది ప్రజలకు తాము ఉచిత రేషన్ ద్వారా ఆహార భద్రత కల్పిస్తున్నామని గుర్తుచేశారు. ఇందులో భాగంగానే తెలంగాణలో కూడా దాదాపు కోటి 20



లక్షల మంది ప్రజలకు 'ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన' కింద ఉచితంగా బియ్యం, పప్పుధాన్యాలను అందిస్తూ కేంద్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందని నడ్డా వివరించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లి, రాబోయే రోజుల్లో తెలంగాణలో బీజేపీ జెండా ఎగురవేయాలని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు.

# 16 జిల్లాల్లో లోటు వర్షాలతో సాగు సంక్షోభం..అన్నదాతకు గండం!

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 09, తెలంగాణ బ్యూరో:** తెలంగాణా రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ వానాకాలం ప్రారంభమై నెలరోజులు గడుస్తున్నా ఇప్పటివరకు ఆశించిన స్థాయిలో వర్షాలు పడలేదు. అనేక జిల్లాలు పూర్తిగా వర్షాల కోసం ఎదురు చూస్తున్న పరిస్థితి ఉంది. ముఖ్యంగా తెలంగాణా రాష్ట్రంలోని 16 జిల్లాలలో లోటు వర్షపాతం నమోదు కావటం ఆందోళన కలిగిస్తుంది. ముఖ్యంగా వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రతికూల పరిస్థితులు కనిపిస్తున్నాయి.

**వర్షాలు లేక 4.22 లక్షల ఎకరాలలో మాత్రమే వరినాట్లు**

వ్యవసాయ శాఖ తాజాగా సమర్పించిన వివరాల ప్రకారం రాష్ట్రంలో మొత్తం 65.95 లక్షల ఎకరాల్లో వరిసాగు చెయ్యాలని లక్ష్యం నిర్ణయించారు. కానీ ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా కేవలం 4.22 లక్షల ఎకరాలలో మాత్రమే ఇప్పటివరకు అన్నదాతలు నాట్లు వేశారు. రుతుపవనాలు తెలంగాణా రాష్ట్రంలోకి జూన్ మాసంలో ప్రవేశించినా జూన్ నుండి ఇప్పటివరకు సాధారణం కంటే 13 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది.

**16 జిల్లాలలో వర్షాభావ పరిస్థితులు**

ముఖ్యంగా జులై నెలలో 16 శాతం లోటు వర్షాలు ఇప్పటివరకు రికార్డ్ అయ్యాయి. ఇది అన్నదాతలను తీవ్ర ఆందోళనకు గురి చేస్తుంది. రాష్ట్రంలో మొత్తం 16 జిల్లాలలో వర్షాభావ పరిస్థితులు ఉన్నాయి. సాధారణం కంటే తక్కువ వర్షాలు నమోదు అవుతున్నాయి. ముఖ్యంగా కరీంనగర్, హన్మకొండ, వరంగల్, జనగామ, జగిత్యాల, మహబూబ్ నగర్ వంటి జిల్లాలలో పరిస్థితి మరీ దారుణంగా ఉంది.

**ఈ నెలలో విస్తారంగా వర్షాలు పడితేనే సాగు**

ఈ ఏడాది వర్షాలు ముఖం చాటేయటంతో చాలా మంది రైతులు సాగు చెయ్యాలంటే భయపడుతున్నారు. ఇప్పటివరకు నాట్లు వేయని రైతులు ఈ నెలలో



అయినా విస్తారంగా వర్షాలు పడితేనే నాట్లు వేసే అవకాశం ఉంది. లేదంటే వరినాట్లు వేయటానికి రైతులు వెనకడుగు వేసే పరిస్థితి ఉంది. అయితే ప్రభుత్వం వరికి బదులు ప్రత్యామ్నాయ పంటలను సాగు చెయ్యాలని సూచిస్తోంది.

**ప్రత్యామ్నాయ పంటలు సాగు చెయ్యాలని రైతులకు సూచన**

వర్షాలు లేని కారణంగా ఎక్కువ నీరు అవసరం లేని ప్రత్యామ్నాయ పంటల సాగు చెయ్యాలని రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. రైతులు మాత్రం ఇంకా వర్షాల కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు. వర్షాలు పడకుంటే అటు అన్నదాతలే కాదు, ఇటు అందరూ తాగునీటి కోసం కూడా కష్టపడవలసి వస్తుంది.

# టీయూడబ్ల్యూజే జిల్లా కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

## అధ్యక్షుడిగా రెండోసారి ఎన్నికైన బండారు యాదగిరి

**ప్రధాన కార్యదర్శిగా అనీల్, కోశాధికారిగా అన్వర్**

**ఎలక్ట్రానిక్ విభాగం అధ్యక్షుడిగా ఆసిఫ్, ప్రధాన కార్యదర్శిగా బసవేశ్వర్**

**చిన్న మధ్య తరహా పత్రికల సంఘం అధ్యక్షుడిగా సిద్ధిక్, ప్రధాన కార్యదర్శిగా ఈశ్వర్ చవాన్**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 09, సంగారెడ్డి జిల్లా ప్రతినిధి :**
టియుడబ్ల్యూజే (ఐజేయు) సంగారెడ్డి జిల్లా శాఖ అధ్యక్షుడిగా బండారు యాదగిరి రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు సంగారెడ్డిలోని టీఎన్జీవో భవన్ లో గురువారం జిల్లా మహాసభను నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ ప్రధాన కార్యదర్శి రామనారాయణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పైసల్ అహ్మద్ రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సలీం ఇతర ముఖ్య నేతలు ఈ మహాసభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా బండారు యాదగిరి ఏకగ్రీవంగా రెండోసారి ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా రు మాండ్ల అనిల్, ఉపాధ్యక్షులుగా శ్రీనాథ్ మతీన్,ఆర్ సత్యనారాయణ రెడ్డి, కిషోర్, మల్లేశం, కోశాధికారిగా అన్వర్, జాయింట్ సెక్రటరీలుగా ఉల్లిగడ్డల శివకుమార్, శ్రీనివాసరెడ్డి, డి.సుమన్, వెంకటేష్ , ఎంఏ రవూఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా విలాస్ విల్సన్, అంజయ్య, ఉల్వల రాజు, రఫీ ఎన్నికయ్యారు. జిల్లా కార్యవర్గ సభ్యులుగా సంగమేశ్వర్, హాసిల్, శివన్న జైన్, సత్తార్ ఖాన్, హబీబ్ ఉద్దీన్, ఆర్ విజయ రాజు, బాలయ్య, శ్రీనివాస్, సత్యం, ఇర్షాన్, ప్రభాకర్ వెంకటేశం, మాజిద్ అలీ, మహబూబ్ ఘోరీ, ముజాహిద్, అబ్దుల్ హై లను ఎన్నుకున్నారు.జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా విభాగం అధ్యక్షునిగా ఆసిఫ్, ఉపాధ్యక్షునిగా హెచ్ఎంటీవీ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా బసవేశ్వర్, కోశాధికారిగా శ్రీధర్ జైన్, జాయింట్ సెక్రటరీగా భూపాల్ రెడ్డి ఎన్నికయ్యారు. చిన్న, మధ్య తరహా పత్రికల సంఘం అధ్యక్షుడిగా సిద్ధిక్ అహ్మద్, ప్రధాన కార్యదర్శిగా జవాన్ ఈశ్వర్, కోశాధికారిగా లక్ష్మణ్, ఉపాధ్యక్షుడిగా నజీర్ ఎన్నికయ్యారు.



# టీయూడబ్ల్యూజే లో మెరిసిన పటాన్ చెరు విలేఖరులు

**టీయూడబ్ల్యూజే జిల్లా కమిటీ ఏకగ్రీవ ఎన్నిక.**
**అధ్యక్షుడిగా రెండోసారి ఎన్నికైన బండారు యాదగిరి.**
**ప్రధాన కార్యదర్శిగా అనీల్, కోశాధికారిగా అన్వర్.**
**ఎలక్ట్రానిక్ విభాగం అధ్యక్షుడిగా ఆసిఫ్, ప్రధాన కార్యదర్శిగా బసవేశ్వర్.**
**చిన్న మధ్య తరహా పత్రికల సంఘం అధ్యక్షుడిగా సిద్ధిక్.**
**ప్రధాన కార్యదర్శిగా ఈశ్వర్ చవాన్.**



**పటాన్ చెరు, హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 09 :**
టియుడబ్ల్యూజే (ఐజేయు) సంగారెడ్డి జిల్లా శాఖ అధ్యక్షుడిగా బండారు యాదగిరి రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంగారెడ్డిలోని టీఎన్జీవో భవన్ లో గురువారం జిల్లా మహాసభను నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ ప్రధాన కార్యదర్శి రామనారాయణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పైసల్ అహ్మద్ రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సలీం ఇతర ముఖ్య నేతలు ఈ మహాసభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా బండారు యాదగిరి ఏకగ్రీవంగా రెండోసారి ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా రు మాండ్ల అనిల్, ఉపాధ్యక్షులుగా శ్రీనాథ్ మతీన్, ఆర్ సత్యనారాయణ రెడ్డి,కిషోర్, మల్లేశం, కోశాధికారిగా అన్వర్, జాయింట్ సెక్రటరీలుగా ఉల్లిగడ్డల శివకుమార్, శ్రీనివాసరెడ్డి ,డి సుమన్, వెంకటేష్ ,ఎంఏ రవూఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా విలాస్ విల్సన్, అంజయ్య, ఉల్వల రాజు, రఫీఎన్నికయ్యారు. జిల్లా కార్యవర్గ సభ్యులుగా సంగమేశ్వర్ ,హాసిల్, శివన్న జైన్, సత్తార్ ఖాన్ ,హబీబ్ ఉద్దీన్, ఆర్ విజయ రాజు, బాలయ్య, శ్రీనివాస్ ,సత్యం, ఇర్షాన్, ప్రభాకర్ వెంకటేశం, మాజిద్ అలీ, మహబూబ్ ఘోరీ, ముజాహిద్, అబ్దుల్ హై లను ఎన్నుకున్నారు. జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా విభాగం అధ్యక్షునిగా ఆసిఫ్, ఉపాధ్యక్షునిగా హెచ్ఎంటీవీ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా బసవేశ్వర్, కోశాధికారిగా శ్రీధర్ జైన్, జాయింట్ సెక్రటరీగా భూపాల్ రెడ్డి ఎన్నికయ్యారు.చిన్న, మధ్య తరహా పత్రికల సంఘం అధ్యక్షుడిగా సిద్ధిక్ అహ్మద్, ప్రధాన కార్యదర్శిగా జవాన్ ఈశ్వర్, కోశాధికారిగా లక్ష్మణ్, ఉపాధ్యక్షుడిగా నజీర్ ఎన్నికయ్యారు.




# నేటి "విద్యాసంస్థల బంద్"ను విజయవంతం చేయండి

## పి.డి.ఎస్.యు, పివైఎల్

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 09, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :**
తెలంగాణ రాష్ట్రంలో విద్యారంగం తీవ్ర సంక్షోభంలో ఉందని, విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపిస్తూ రాష్ట్రంలోని వామపక్ష విద్యార్థి సంఘాలు జూలై 10న రాష్ట్రవ్యాప్తంగా "విద్యా సంస్థల బంద్" నిర్వహించాలని పి వై ఎల్, పి.డి.ఎస్.యు.రాష్ట్ర సహాయ కార్యదర్శి బేజాడి కుమార్ పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో వేలాది ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నప్పటికీ ప్రభుత్వం భర్తీ చేయడం లేదని, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయకుండా నిర్వీర్యం చేసే విధానాలను అమలు చేస్తోందని, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాల్సిన బాధ్యతను ప్రభుత్వం విస్మరించిందని, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కొరత, ఉపాధ్యాయుల కొరత, హాస్టళ్లలో సమస్యలు, స్కాలర్‌షిప్‌లు మరియు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విద్యార్థులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయని, అలాగే పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని, ఖాళీగా ఉన్న టీచర్, లెక్చరర్, ఎంఇఓ, డిఇఓ తదితర పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని, పెండింగ్‌లో ఉన్న జీవో నెం. 7, 8, 9 లను రద్దు చేయాలని, ఇంటర్, డిగ్రీ, యూనివర్సిటీ విద్యార్థులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించాలని, హాస్టళ్లు, గురుకులాలు, ప్రభుత్వ విద్యాసంస్థల్లో నాణ్యమైన సౌకర్యాలు అందించాలని, విద్యార్థినుల భద్రతకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, ప్రతి విద్యాసంస్థలో ఐసిసి కమిటీలను ఏర్పాటు చేయాలని, కార్పొరేట్ విద్యా వ్యవస్థ నియంత్రణకు చర్యలు తీసుకోవడంతో పాటు, విద్యపై ప్రభుత్వ వ్యయాన్ని పెంచాలని, ఈ డిమాండ్లతో రాష్ట్రవ్యాప్తంగా జూలై 10న నిర్వహించనున్న విద్యా సంస్థల బంద్ ను



విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజాసంఘాలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు

# భువనగిరి అభివృద్ధి, సుందరీకరణలో భాగంగా పీసీసి డెలిగేట్ ..విద్యుత్ అధికారులతో చర్చ

## టి.జి.ఎస్.పి.డి.సి.ఎల్, ఐఏఎస్ జీతిష్.వి.పాటీల్ ని కలిసిన పీసీసి డెలిగేట్ తంగళ్ళపల్లి రవికుమార్



**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 09, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** భువనగిరి పట్టణ అభివృద్ధి, సుందరీకరణలో భాగంగా టి.జి.ఎస్.పి.డి.సి.ఎల్ పరిధిలో విద్యుత్ సరఫరా మెరుగుదల మరియు కొత్త ప్రణాళికల అమలుపై తెలంగాణ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ డైరెక్టర్, (ఐఏఎస్ అధికారి) జితేష్.వి.పాటిల్ ని పీసీసి డెలిగేట్ తంగళ్ళపల్లి రవికుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా భువనగిరి పట్టణంలోని విద్యుత్ సమస్యలపై విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా పాత మరియు దెబ్బతిన్న విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్త స్తంభాల ఏర్పాటు, కొత్త విద్యుత్ లైనులు, కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, లో-వోల్టేజ్ సమస్యల పరిష్కారం మరియు భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అవసరమైన విద్యుత్ ప్రణాళికలపై చర్చించడం జరిగింది.పట్టణంలోని కొత్త కాలనీలు, విస్తరిస్తున్న ప్రాంతాలకు అదనపు విద్యుత్ సౌకర్యాలు కల్పించి, సుందరీకరణలో భాగంగా విద్యుత్ స్తంభాలను పద్ధతిగా ఏర్పాటు చేయాలని కోరారు. వ్యవసాయ, గృహ వినియోగదారులకు నిరంతర విద్యుత్ సరఫరా అందించేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అధికారి జీతిష్ పటేల్ సానుకూలంగా స్పందించి, భువనగిరి పట్టణ విద్యుత్ సమస్యల పరిష్కారానికి టి.జి.ఎస్.పి.డి.సి.ఎల్ ద్వారా తక్షణ చర్యలు తీసుకుంటామని, పాత స్తంభాల స్థానంలో కొత్త స్తంభాలు మరియు కొత్త లైన్ల ఏర్పాటుకు నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పానుగంటి భాస్కర్, కూర శివ కుమార్, అంజన్ తదితరులు పాల్గొన్నారు.

# జహీరాబాద్‌లో పూర్తిస్థాయి ఈఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటు చేయాలి

## మంత్రి వివేక్ వెంకటస్వామికి వినతిపత్రం అందజేసిన మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అస్మా



**హైదరాబాద్ పల్స్ న్యూస్, జులై 09, జహీరాబాద్:** జహీరాబాద్ నియోజకవర్గంలో పూర్తిస్థాయి ఈఎస్ఐ (జు×) ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని జహీరాబాద్ నియోజకవర్గ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అస్మా కోరారు.గురువారం కార్మిక, ఉపాధి, శిక్షణ మరియు కర్మాగారాల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామికి వినతిపత్రాన్ని అందజేశారు.అనేక కర్మాగారాలు మరియు వేలాది మంది కార్మికులతో జహీరాబాద్ ప్రాంతం వేగంగా పారిశ్రామిక కేంద్రంగా అభివృద్ధి చెందుతోందని వినతి పత్రంలో పేర్కొన్నారు. ప్రస్తుతం ఇక్కడ కేవలం ఒక ఈఎస్ఐ డిస్పెన్సరీ మాత్రమే ఉందని, అది కూడా పనిచేయని స్థితిలో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల కార్మికులు మరియు వారి కుటుంబాలు వైద్య సేవలు పొందడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.పారిశ్రామిక కార్మికులు, వారి కుటుంబాలు మరియు నియోజకవర్గం, పరిసర ప్రాంతాల ప్రజల ప్రయోజనాల దృష్ట్యా జహీరాబాద్‌లో ఈఎస్ఐ ఆసుపత్రిని మంజూరు చేయడానికి తక్షణ చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు.

# ఈ20 పెట్రోల్ తో మైలేజీ తగ్గుతుందా? కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ క్లారిటీ?

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 09, సెంట్రల్ డెస్క్ :**
ఈ20 పెట్రోల్ వల్ల వాహనాల ఇంజన్లు పాడైపోతున్నాయని.. మైలేజ్ పడిపోతోందని సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తీవ్రంగా ఖండించారు. ఇదంతా ప్రణాళికా ప్రకారం జరుగుతున్న దుష్ప్రచారమని ఆయన కొట్టిపారేశారు. ఈ20 పెట్రోల్ ను దేశవ్యాప్తంగా అందుబాటులోకి తీసుకురావడానికి ముందు పుణెలోని ఆటోమోటివ్ రీసెర్చ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, ప్రముఖ వాహన తయారీ సంస్థలు అన్ని రకాల పరీక్షలు నిర్వహించాయని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ వెల్లడించారు. అన్ని అనుమతులు వచ్చాకే దీనిని అమలు చేశామని తెలిపారు.కొన్ని వాహనాల్లో సమస్యలు వచ్చినట్లు తేలడంతో కంపెనీలతో విచారణ జరిపించామని.. అందులో ఈ20 పెట్రోల్ వాడటం వల్ల కాకుండా.. కల్తీ ఇంధనం వల్లే సమస్యలు వచ్చినట్లు తేలిందని మంత్రి చెప్పుకొచ్చారు. ఈ20 పెట్రోల్ వల్ల ఇప్పటివరకు ఓ ఒక్క వాహనం కూడా పాడవ్వలేదని ఆయన స్పష్టం చేశారు. పాత వాహనాల్లోని కొన్ని చిన్న విడిభాగాలపై స్వల్ప ప్రభావం పడే అవకాశం ఉందని.. అందువల్ల సర్వీసింగ్ సమయంలో వాటి స్థానంలో రబ్బర్ వాషర్లను ఎలాంటి అదనపు రుసుము లేకుండా ఉచితంగా మార్చాలని వాహన కంపెనీలను ఆదేశించినట్లు మంత్రి తెలిపారు.

**మైలేజీపై స్వల్ప ప్రభావం:**

పెట్రోల్‌తో పోలిస్తే ఇథనాల్ కు ఇంధన సామర్థ్యం కొంత తక్కువగా ఉంటుంది. దీనివల్ల మైలేజ్ స్వల్పంగా తగ్గే అవకాశం ఉన్న మాట నిజమే అయినా.. చాలా సందర్భాల్లో ఈ ప్రభావం చాలా తక్కువగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఢిల్లీ, ముంబై వంటి నగరాల్లో ట్రాఫిక్ వల్ల వాహనాలు తక్కువ గేర్లలో నడుస్తాయని.. పదే పదే బ్రేకులు వేయాల్సి వస్తుందని నితిన్ గడ్కరీ చెప్పుకొచ్చారు. స్థిరంగా 100 కిలోమీటర్ల వేగంతో వెళ్లేటప్పుడు మైలేజ్ లో కొంత తేడా కనిపించవచ్చని.. కానీ నగరాల ట్రాఫిక్‌లో పెద్దగా మార్పు తెలియదని వివరించారు. ఫ్లెక్స్ ఫ్యూయల్ ఇంజన్లలో అసలు మైలేజ్ సమస్యే లేదని నివేదికలు చెబుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇథనాల్ వినియోగం వల్ల ఇంజన్ నాకింగ్ తగ్గుతుందని, దీని ఆక్టేన్ నంబర్ కూడా ఎక్కువేనని నితిన్ గడ్కరీ చెప్పారు. పనితీరు పరంగా ఇథనాల్ ఉత్తమమైనదని నిరూపితమైందని నితిన్ గడ్కరీ పేర్కొన్నారు.

**ఫ్లెక్స్-ఫ్యూయల్ ఇంజన్ల వైపు అడుగులు**

బ్రెజిల్‌లో 1970ల నుంచే 27 శాతం ఇథనాల్ మిశ్రమాన్ని వాడుతున్నారని.. అక్కడ హోండా, హ్యుందాయ్ వంటి కంపెనీల ఫ్లెక్స్-ఫ్యూయల్ వాహనాలు ఎలాంటి ఇబ్బంది లేకుండా నడుస్తున్నాయని గుర్తు చేశారు. ప్రస్తుతం ఇండియాలో కూడా టాటా మోటార్స్, మహీంద్రా, హ్యుందాయ్, టయోటా, మారుతి సుజుకి వంటి దాదాపు డజను కంపెనీలు తమ సరికొత్త ఫ్లెక్స్-ఫ్యూయల్ మోడళ్లను మార్కెట్లోకి తీసుకురావడానికి సిద్ధంగా ఉన్నాయని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. ప్రజలకు తక్కువ ధరలో ప్రత్యామ్నాయ ఇంధనాన్ని అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ.



# ప్రధాని మోదీకి ఆస్ట్రేలియా రిటర్న్ గిఫ్ట్: ఒక్కో విగ్రహానికి ఒక్కో ప్రాచీన చరిత్ర



**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 09, సెంట్రల్ డెస్క్:**
ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రస్తుతం ఆస్ట్రేలియాలో పర్యటిస్తోన్నారు. ఇండోనేషియా పర్యటనను విజయవంతంగా పూర్తి చేసుకున్న ఆయన మెల్ బోర్న్ లో అడుగు పెట్టారు. ఆ దేశ ప్రధానమంత్రి ఆంథోనీ అల్బనీస్ తో భేటీ అయ్యారు. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సమవేశాల్లో పాల్గొన్నారు. భారత్–ఆస్ట్రేలియా సీఈఓ ఫోరమ్, ఎకనామిక్ రోడ్‌మ్యాప్ బిజినెస్ రిసెప్షన్ కు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీతో ఆంథోనీ అల్బనీస్ ఓ సెల్ఫీ తీసుకున్నారు.

ఈ పర్యటన నేపథ్యంలో..ప్రధాని మోదీకి ఆస్ట్రేలియా కొన్ని రిటర్న్ గిఫ్ట్ లను అందించింది. భారత్ కు చెందిన అపురూపమైన చారిత్రక విగ్రహాలు, పూజా సామాగ్రిని వెనక్కి ఇచ్చేసిందా దేశం. అవి త్వరలోనే తిరిగి స్వదేశానికి చేరుకోనున్నాయి. తమిళనాడులోని అతి పురాతన ఆలయాలకు చెందిన ఈ అరుదైన సాంస్కృతిక సంపదను భారత్ కు తిరిగి అప్పగించడానికి ఆస్ట్రేలియా అంగీకరించింది. దీనికి సంబంధించిన ఏర్పాట్లను కూడా పూర్తి చేసింది.ఇందులో భద్రకాళి అమ్మవారి రూపంతో కూడిన లోహపు త్రిశూలం, పవిత్ర రాతి నంది విగ్రహం, షణ్ముఖ కార్తికేయుడి రాతి విగ్రహం ఉన్నాయి. దీంతో దేశ పురాతన సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించే దిశగా, చట్టవిరుద్ధ రవాణాకు అడ్డుకట్ట వేసే విషయంలో ఓ ముందడుగు పడినట్టయింది. భారతీయ శిల్పకళా వైభవానికి, అపార సాంస్కృతిక చరిత్రకు నిదర్శనమైన ఈ కళాఖండాలు చోళులు, విజయనగర రాజుల కాలం నాటివి.తిరిగా రాబోతున్న ఈ కళాఖండాలలో తమిళనాడులోని తిరువారూర్ జిల్లా, కొల్లుమాంగుడిలో కొలువై ఉన్న శ్రీ కాశీవిశ్వనాథస్వామి ఆలయానికి చెందిన రెండు ముఖ్యమైన లోహ, రాతి శిల్పాలు ఉన్నాయి. అందులో మొదటిది త్రిశూలం. దీని పైభాగంలో ఉగ్రరూపంలో ఉన్న భద్రకాళి అమ్మవారి ప్రతిమ అత్యంత కళాత్మకంగా చెక్కారు కళాకారులు. శైవ శాక్తేయ సంప్రదాయాల ప్రకారం ఈ త్రిశూలం దుష్టశిక్షణ, దైవిక శక్తి, రక్షణకు ప్రతీకగా నిలుస్తుంది. ఇది దాదాపు 13వ శతాబ్దం నుంచి 16వ శతాబ్దానికి చెందినదిగా భావిస్తున్నారు.అదే కాశీవిశ్వనాథస్వామి ఆలయానికి చెందిన మరో అరుదైన రాతి శిల్పం.. నంది విగ్రహం. పరమశివుడి వాహనమైన ఈ నందిని తమిళ శైవ శిల్ప సంప్రదాయంలో అత్యంత సహజసిద్ధంగా తీర్చిదిద్దారు. మెడలో గంటలు, అందమైన పూలదండలతో ప్రశాంత వదనంతో పడుకుని ఉన్న భంగిమలో ఉన్న ఈ నంది శిల్పం చోళుల నాటి శిల్పకళా శైలిని కలిగి ఉంది. శైవ క్షేత్రాల్లో మహాశివుడి గర్భగుడికి అభిముఖంగా కనిపించే నంది విగ్రహం.. నిస్వార్థ భక్తి, బలం, ధర్మానికి ప్రతీక.వీటితో పాటు తంజావూరు జిల్లా మానంబాడిలో కొలువైన ప్రసిద్ధ నాగనాథస్వామి దేవాలయానికి చెందిన ఆరు తలల కార్తికేయుడి రాతి విగ్రహం కూడా త్వరలోనే భారత్‌కు రానుంది. ఈ ఆలయం.. 11వ శతాబ్దంలో మొదటి రాజేంద్ర చోళుడి కాలంలో నిర్మితమైంది. కార్తికేయుడి ఈ ఆరు ముఖాల రూపం అపారమైన దివ్య జ్ఞానం, శౌర్యాం, రక్షణను సూచిస్తుంది. 12 చేతుల్లో విభిన్న ఆయుధాలను ధరించి, పక్కనే వాహనమైన నెమలితో కూడి ఉన్న ఈ ఐతిహాసిక శిల్పం చోళుల కాలపు శిల్పకళా ప్రాభవానికి అద్దం పడుతోంది.

# ఓటర్ల జాబితా సవరణ పారదర్శకంగా చేపట్టాలి

**జహీరాబాద్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పట్లోళ్ల నర్సింహారెడ్డి**




**హైదరాబాద్ పల్స్ న్యూస్, జులై 09, జహీరాబాద్:**
ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను పారదర్శకంగా చేపట్టాలని జహీరాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పట్లోళ్ల నర్సింహారెడ్డి అన్నారు.జహీరాబాద్ మండలంలోని గోవింద్‌పూర్ గ్రామంలో గురువారం ఓటర్ల జాబితా సవరణపై ఇంటింటికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.బూత్ స్థాయి ఏజెంట్లు, బీఎల్ఏలు క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో నమోదయ్యేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు.2002 ఓటర్ల డేటా మ్యాపింగ్ మరియు సవరణలో కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని ఆయన వివరించారు.ఈ కార్యక్రమంలో సీడీసీ డైరెక్టర్ మల్లారెడ్డి, సొసైటీ వైస్ చైర్మన్ ఇమామ్ పటేల్, సీనియర్ నాయకులు నర్సింహులు, జుబేర్ పటేల్, దిలీప్ కుమార్, గోపాల్, అంజన్న, వీరన్న, బీఎల్వోలు, బీఎల్ఏలతో పాటు పలువురు గ్రామ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పదేళ్ల నిరీక్షణకు తెర.. భారత్ చేతికి 'యూరేనియం' పవర్..

హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 09, సెంట్రల్ డెస్క్: భారతదేశ ఇంధన భద్రతా చరిత్రలో సరికొత్త అధ్యాయం లిఖితమైంది. దశాబ్ద కాలంగా పెండింగ్‌లో ఉన్న అత్యంత ప్రతిష్టాత్మక పౌర అణు ఒప్పందం ఎట్టకేలకు కొలిక్కి వచ్చింది. మెల్‌బోర్న్ వేదికగా జరిగిన మూడో భారత్ – ఆస్ట్రేలియా వార్షిక శిఖరాగ్ర సదస్సులో ఇరు దేశాలు ఈ చారిత్రాత్మక నిర్ణయాన్ని ప్రకటించాయి. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్ జరిపిన సుదీర్ఘ చర్చల అనంతరం, యురేనియం సరఫరాకు సంబంధించి తుది పరిపాలనాపరమైన ఏర్పాట్లు పూర్తయ్యాయి. వాస్తవానికి 2014–15లోనే ఇరుదేశాల మధ్య ప్రాథమిక పౌర అణు ఒప్పందం కుదిరినప్పటికీ, పర్యవేక్షణ యంత్రాంగంపై ఇన్నాళ్లూ ఉన్న స్పష్టత లేమి, దౌత్యపరమైన అడ్డంకులు తాజా నిర్ణయంతో పూర్తిగా పటాపంచలయ్యాయి.భారత్ అణు నిరోధక ఒప్పందంపై సంతకం చేయని దేశం కావడంతో, ఆస్ట్రేలియా ఇన్నాళ్లూ యురేనియం ఎగుమతి చేయడానికి తీవ్రంగా సంకోచించింది. అయితే, ప్రస్తుత వ్యూహాత్మక ఒప్పందం ప్రకారం సరఫరా అయ్యే యురేనియం అంతా కేవలం పౌర విద్యుత్ అవసరాల కోసమేనని ఇరుదేశాలు స్పష్టం చేశాయి. అంతర్జాతీయ అణుశక్తి సంస్థ నిర్దేశించిన అత్యంత కఠినమైన నిబంధనలు, పర్యవేక్షణ మార్గదర్శకాలకు లోబడి మాత్రమే ఈ ఇంధన బదిలీ ప్రక్రియ సాగనుంది. తద్వారా అంతర్జాతీయ వేదికలపై భారతదేశానికి ఉన్న విశ్వసనీయతకు మరోసారి అద్భుతమైన గుర్తింపు లభించినట్లయింది.




**28% గ్లోబల్ నిల్వలు.. భారత్ క్లీన్ ఎనర్జీ కలలకు రెక్కలు!**

భారతదేశం 2047 నాటికి అణు విద్యుత్ ఉత్పత్తిని ఏకంగా 100 గిగావాట్లకు పెంచాలని అత్యంత ప్రతిష్టాత్మకమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. ప్రస్తుతం దేశంలో ఉన్న 24 అణు రియాక్టర్ల ద్వారా కేవలం 8.78 గిగావాట్ల విద్యుత్ మాత్రమే అందుబాటులో ఉంది. ఈ మహా లక్ష్యాన్ని ఛేదించాలంటే భారత్‌కు కొండంత యురేనియం అవసరం. సరిగ్గా ఇక్కడే ప్రపంచంలోనే అత్యధికంగా 28 శాతం యురేనియం నిల్వలు ఉన్న ఆస్ట్రేలియా సహకారం భారత్‌కు అసలైన 'గేమ్ ఛేంజర్' కానుంది. బొగ్గు ఆధారిత విద్యుత్‌పై ఆధారపడటాన్ని తగ్గించి, 2070 నాటికి దేశాన్ని 'నెట్–జీరో ఉద్గారాల' వైపు నడిపించడంలో ఈ అణు ఇంధనం అత్యంత కీలక పాత్ర పోషించనుంది. ఇటీవల తమిళనాడులోని కల్పక్కంలో ప్రోటోటైప్ ఫాస్ట్ బ్రీడర్ రియాక్టర్ విజయవంతం కావడం ఈ అణు వ్యూహాన్ని రెండో దశకు తీసుకెళ్లింది.

**'ఆస్ట్రేలియా సూపర్' పెట్టుబడులు!**

ఈ చారిత్రాత్మక పర్యటన కేవలం అణు ఇంధనానికే పరిమితం కాలేదు. గ్రీన్ హైడ్రోజన్, సాంప్రదాయేతర ఇంధన వనరులు, సెమీకండక్టర్స్, బ్యాటరీల తయారీకి అవసరమయ్యే 'క్రిటికల్ మినరల్స్' రంగాల్లోనూ ఇరుదేశాలు భాగస్వామ్యాన్ని పటిష్టం చేసుకోనున్నాయి. భారత మౌలిక సదుపాయాల రంగంలో పెట్టుబడులు పెట్టాల్సిందిగా ప్రధాని మోదీ ఇచ్చిన పిలుపునకు ఆస్ట్రేలియా నుంచి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ఇందులో భాగంగానే ఆస్ట్రేలియాకు చెందిన అతిపెద్ద పెన్షన్ ఫండ్ 'ఆస్ట్రేలియా సూపర్'.. భారత జాతీయ మౌలిక సదుపాయాల నిధిలో అదనంగా 500 మిలియన్ ఆస్ట్రేలియన్ డాలర్ల భారీ పెట్టుబడులను ప్రకటించింది.

**భవిష్యత్తుపై భరోసా..**

ఇండో–పసిఫిక్ ప్రాంతంలో ఆర్థిక, వ్యూహాత్మక సంబంధాలను సరికొత్త శిఖరాలకు తీసుకెళ్లడంలో ఈ మైత్రి మైలురాయిగా నిలవనుంది. ఇరుదేశాల మధ్య పెరుగుతున్న నమ్మకానికి, పరస్పర ప్రయోజనాలకు ఈ తాజా ఒప్పందమే నిదర్శనమని ఆస్ట్రేలియా ప్రధాని కొనియాడారు. ఈ గ్లోబల్ డీల్ అటు ఆస్ట్రేలియాకు ఒక సుస్థిరమైన ప్రతిష్టాత్మక మార్కెట్‌ను అందించడమే కాకుండా, ఇటు భారతదేశ ఇంధన భద్రతకు తిరుగులేని 'యురేనియం పవర్' లైఫ్‌లైన్‌గా మారనుంది.

# భువనగిరి పట్టణంలో ప్రముఖ హోటల్‌లో ఆకస్మిక తనిఖీ

**హోటళ్లు, రెస్టారెంట్లు ఆహార భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలి**

**వినియోగదారులకు నాణ్యమైన ఆహారం అందించాలి**

**నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకొంటాం**

**భువనగిరి పట్టణాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యకరంగా ఉంచడమే మా లక్ష్యం**

**మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్**







హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 09, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : భువనగిరి పట్టణంలోని ప్రముఖ హోటల్‌లో పరిశుభ్రత, ఆహార నాణ్యత మరియు ఇతర సౌకర్యాలపై పట్టణ మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్ మరియు మున్సిపల్ కమిషనర్ చంద్ర ప్రకాష్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా హోటల్‌లోని వంటగది, డైనింగ్ హాల్, తాగునీటి సౌకర్యాలు, మురుగునీటి పారుదల వ్యవస్థను పరిశీలించారు. హోటల్ నిర్వాహకులకు పరిశుభ్రత ప్రమాణాలు పాటించాలని, వినియోగదారులకు నాణ్యమైన ఆహారం అందించాలని సూచించారు.అనంతరం మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్ మాట్లాడుతూ, భువనగిరి పట్టణాన్ని పరిశుభ్రంగా మరియు ఆరోగ్యకరంగా ఉంచేందుకు మున్సిపల్ అధికారులు నిరంతరం తనిఖీలు చేస్తామని తెలిపారు. హోటళ్లు, రెస్టారెంట్లు ఆహార భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.పట్టణ ప్రజల ఆరోగ్యమే ప్రధానమని, ఎవరికీ అన్యాయం జరగకుండా పారదర్శకంగా పనిచేస్తామని చైర్మన్ స్పష్టం చేశారు.ఈ తనిఖీల్లో మున్సిపల్ సిబ్బంది, ఆహార భద్రతా అధికారులు తదితరులు పాల్గొన్నారు

# ఐఎస్ఐ కొత్త కుట్ర: బ్రిటన్, కెనడాలోని భారతీయులకు హై అలర్ట్!

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 09, సెంట్రల్ డెస్క్ :**
బ్రిటన్, కెనడాలో నివసిస్తున్న భారతీయుల భద్రతకు సంబంధించి భారత గూఢచార సంస్థలు తీవ్ర హెచ్చరిక జారీ చేశాయి. గూఢఛార నివేదికల ప్రకారం.. పాకిస్థాన్ గూఢచార సంస్థ ఐఎస్ఐ, ఖలిస్తాన్ అనుకూల శక్తులు ఇండియాకు, ప్రధాని మోదీకి అనుకూలంగా వ్యవహరించే వారిపై దాడులకు కుట్ర పన్నుతున్నాయి. నిఘా వర్గాల ప్రకారం.. ఇటీవల కాలంలో బ్రిటన్, కెనడాలోని భారతీయులపై విద్వేష నేరాలు, హింసాత్మక ఘటనలు పెరిగాయి. ఖలిస్తాన్ అనుకూల శక్తులు ఈ దాడులకు పాల్పడుతున్నాయని ఆరోపణలు ఉన్నాయి. గతంలో ఇలాంటి ఘటనలు చెదురుముదురుగా జరిగేవి.. కానీ ఇప్పుడు అవి మరి వ్యవస్థీకృతంగా మారవచ్చనే భయాలు నెలకొన్నాయి. ఈ దాడులను అడ్డుకునేందుకు భారత భద్రతా సంస్థలు ఆ దేశాల భద్రతా సంస్థలతో కలిసి సమన్వయంతో పనిచేస్తున్నాయి.

**నిఘా అధికారులు ఏమంటున్నారంటే?**

ఖలిస్తాన్ ఉద్యమానికి మద్దతు ఇచ్చే ఐఎస్ఐ.. బ్రిటన్, కెనడాలోని భారతీయులపై దాడులు చేసేందుకు కార్యకలాపాలను ముమ్మరం చేయాలని ఐరోపాలో పనిచేస్తున్న తన నెట్వర్క్ కు ఆదేశాలు జారీ చేసిందని ఓ ఇంటెలిజెన్స్ బ్యూరో అధికారి వెల్లడించారు. ఆ అధికారి ప్రకారం.. ఈ ఘటనలు ఒక ప్లాన్ లో భాగంగా జరిగే అవకాశం ఉందని అనుమానిస్తున్నారు. "ఐఎస్ఐ భారతీయలపై వరుస సమన్వయ దాడులకు ప్రణాళిక రచిస్తోంది. ఈ శక్తులు భారత్ కు అనుకూలంగా వ్యవహరించేవారిని లేదా ప్రధాని మోదీ మద్దతుదారులను లక్ష్యంగా చేసుకోవచ్చు. దీనిని ఒక సాకుగా ఉపయోగించుకుని ఇలాంటి దాడులు చేయవచ్చు." అని ఆ అధికారి పేర్కొన్నారు. ఆ అధికారి వెల్లడించిన వివరాల ప్రకారం.. ఖలిస్తాన్ ఉద్యమం ఊపందుకోకపోవడం పట్ల కలిగిన నిరాశ ఫలితంగానే ఐఎస్ఐ వ్యూహంలో ఈ మార్పు వచ్చింది. లక్ష్యం కేవలం భారతీయులు మాత్రమే కాదని.. ఖలిస్తాన్ సంబంధిత కేసులపై దర్యాప్తు జరిపి చర్యలు తీసుకుంటున్న భారతీయ ఏజెన్సీలు కూడా ఉంటాయని ఆయన పేర్కొన్నారు.



**ఖలిస్తాన్ కు లభించని మద్దతు.. నిరాశలో పాక్ నిఘా సంస్థ**

హింసాత్మక దాడులు చేయడానికి ఐఎస్ఐ తన గ్యాంగ్‌స్టర్ నెట్‌వర్క్‌ను ఉపయోగించుకోవచ్చని మరో అధికారి వెల్లడించారు. ఈ దిశగా యూరప్, ఇండియాలో పనిచేస్తున్న మాడ్యూళ్లను యాక్టివ్ చేయాలని ఆదేశాలు జారీ చేయబడ్డాయి. స్థానిక గ్యాంగ్‌స్టర్ల ద్వారా ఇండియాలో దాడులు చేయడమే ప్రణాళిక. అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. ఇటీవలి కాలంలో బ్రిటన్, కెనడాలో ఖలిస్తాన్ ఉద్యమానికి మద్దతు గణనీయంగా తగ్గింది. గతంలో స్థానిక జనాభాలోని ఓ వర్గం ఈ ఉద్యమం పట్ల సానుభూతితో ఉండేది, కానీ ఇప్పుడు పరిస్థితి వేగంగా మారుతోంది. ఖలిస్తాన్ ఉద్యమం, దానికి అనుబంధంగా ఉన్న గ్యాంగ్‌స్టర్ నెట్‌వర్క్‌లు ఇప్పుడు తాము ప్రకటించిన లక్ష్యానికి బదులుగా దోపిడీ, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, ఆయుధాల స్మగ్లింగ్ వంటి నేర కార్యకలాపాలలో నిమగ్నమై ఉన్నాయని ప్రజలు భావిస్తున్నారు.బ్రిటన్, కెనడాలో నివసిస్తున్న భారతీయ సంతతికి చెందిన చాలా మంది ప్రజలు శాంతియుత జీవితాన్ని కోరుకుంటున్నారని అధికారులు అంటున్నారు. ఖలిస్తాన్ అనుకూల శక్తుల హింసాత్మక కార్యకలాపాలు సామాజిక సామరస్యాన్ని దెబ్బతీయడమే కాకుండా, భారతీయ సమాజ ప్రతిష్టను కూడా దెబ్బతీస్తున్నాయి. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కెనడా ప్రధాన మంత్రి మార్క్ కార్నీల మధ్య జరిగిన సమావేశాల అనంతరం ఇరు దేశాల మధ్య సంబంధాలు మెరుగుపడటంతో, ఖలిస్తాన్ అనుకూల నెట్‌వర్క్‌లపై చర్యలు తీసుకునేందుకు భారత ఏజెన్సీలకు అవకాశం లభించింది. ఎన్ని ప్రణాళికలు రచించినా విఫలం కావడంతో విసుగు చెందిన ఐఎస్ఐ,ఖలిస్తాన్ అనుకూల ఉగ్రవాద నెట్‌వర్క్‌లు ఇప్పుడు తమ దృష్టిని భారత దర్యాప్తు సంస్థలు, విదేశాల్లోని భారతీయులను లక్ష్యంగా చేసుకున్నాయని నిఘా అధికారులు చెబుతున్నారు.

# ఆడపిల్లలు కాదమ్మా వీళ్లు..కొడుకులను మించిన రత్నాలు! కట్టుబాట్లను తెంచి కాటికి



**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 09, ఏపీ డెస్క్:** కొడుకు లేడనే వెలితిని దాచి.. గుండె గూటిలో వారిని పెంచి.. ప్రాణంగా చూసుకున్న నాన్న లోకాన్ని వీడితే.. కట్టుబాట్ల గీతలను దాటారు ఆ ఇద్దరు ఆడబిడ్డలు. "నీ పాడెను మోసే భాగ్యం.. నీ చితికి తలకొరివి పెట్టే కర్తవ్యం మాదైంది.." అంటూ సాగిన అంతిమ యాత్రను చూసి ఆ ఊరి ప్రజల గుండెలు తల్లడిల్లాయి.సమాజంలో మారుతున్న ఆలోచనలకు, ఆడపిల్లల ఆత్మస్థైర్యానికి అద్దం పడుతూ.. కన్నతండ్రి పాడెను భుజాన మోయడమే కాకుండా, శ్మశానవాటికలో తలకొరివి పెట్టి తమ పితృభక్తిని, కర్తవ్యాన్ని చాటుకున్నారు. తూర్పుగోదావరి జిల్లా రావులపాలెంలో జరిగిన ఈ ఘటన స్థానికులను తీవ్ర భావోద్వేగానికి గురిచేయడంతో పాటు ప్రతి ఒక్కరి చేత కంటతడి పెట్టించింది.

**గుండెపగిలే విషాదం.. అండగా నిలిచిన ఆడబిడ్డలు!**

రావులపాలెం గ్రామానికి చెందిన దొంకిన సుబ్రహ్మణ్యం (39) అనే వ్యక్తి అకస్మాత్తుగా బ్రెయిన్ స్ట్రోక్ కు గురై కన్నుమూశారు. చిన్న వయసులోనే ఇంటి యజమాని మరణించడంతో ఆయన భార్య మంగాదేవి, కుమార్తెలు కళ్యాణి, గాయత్రి తీవ్ర శోకసముద్రంలో మునిగిపోయారు. సుబ్రహ్మణ్యానికి కుమారులు లేకపోవడంతో అంతిమ సంస్కారాలు ఎవరు నిర్వహించాలనే ప్రశ్న తలెత్తిన వేళ.. ఆ ఇద్దరు కుమార్తెలు కన్నీరు తుడుచుకుని తామే ఈ బాధ్యతను స్వీకరిస్తామని ముందుకొచ్చారు.

**ఊరేగింపుగా వెళ్లి.. సంప్రదాయబద్ధంగా అంత్యక్రియలు**

ఆడపిల్లలు స్మశానానికి వెళ్లకూడదనే పాత చింతకాయ పద్ధతులను పక్కనబెట్టి.. తండ్రిపై ఉన్న అపారమైన అనురాగంతో శ్మశానవాటిక వరకు నడిచారు. తండ్రి పాడెను తమ భుజాలపై మోస్తూ కదిలిన ఆ దృశ్యం చూసి బంధుమిత్రులు, గ్రామస్తులు ముక్కున వేలేసుకున్నారు. అనంతరం హిందూ సంప్రదాయాల ప్రకారం అంతిమ సంస్కారాల ప్రక్రియను పూర్తి చేసి, తండ్రి చితికి తలకొరివి పెట్టారు."నాన్న మమ్మల్ని ప్రాణంగా చూసుకున్నారు. జీవితాంతం మాకు కొడుకు లేడనే బాధ తెలియకుండా పెంచారు. అలాంటి నాన్నకు ఆఖరి వీడ్కోలు పలికే అదృష్టం, బాధ్యత మాకే దక్కాలని భావించాం" అంటూ ఆ కుమార్తెలు కన్నీటిపర్యంతమయ్యారు. సమాజంలో కొడుకులే అంత్యక్రియలు చేయాలనే మూఢనమ్మకాలను బద్దలు కొడుతూ.. కన్నతండ్రిపై తమకున్న ప్రేమే శ్రేష్ఠమైనదని నిరూపించిన ఈ ఇద్దరు ఆడబిడ్డల ధైర్యాన్ని, సంస్కారాన్ని రావులపాలెం ప్రజలు చేతులెత్తి మొక్కుతూ ప్రశంసించారు.

# రాజపేటలో 'సర్' హెల్ప్ డెస్క్ ప్రారంభించిన ఏఎంసి డైరెక్టర్




**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 09, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆఫీస్ లో సర్ హెల్ప్ డెస్క్ (2026) ప్రారంభించిన కోఆర్డినేటర్ ఏఎంసి డైరెక్టర్ సిలివేరు బాలరాజ్ గౌడ్ ఈ సందర్భంగా ఏఎంసి డైరెక్టర్ బాలరాజ్ గౌడ్ మాట్లాడుతూ... రాజపేట మండలంలోని ప్రతి ఒక్క ఓటును పరిశీలించి నమోదు చేయించాల్సిన బాధ్యత బిఎల్ఎ లకు ఉన్నదని అన్నారు. గ్రామ సర్పంచ్, గ్రామ శాఖ అధ్యక్షులు ముఖ్య నాయకులు పార్టీ శ్రేణులు, ప్రజలు కూడా పూర్తిస్థాయిలో బిఎల్ఎ లకు సహకరించాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాజపేట మండల అధ్యక్షుడు నమిలే మహేందర్ గౌడ్, రాష్ట్ర కిసాన్ సెల్ ప్రధాన కార్యదర్శి బుడిగ పెంటయ్య గౌడ్ రాజపేట ఉపసర్పంచ్ కేదారి గౌడ్, గౌర బక్కయ్య, గ్రామ శాఖ అధ్యక్షుడు, బింగి రమేష్ రాజపేట మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ జన్న గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## SPORTS

# కరన్ శతకమోత.. రెండో వన్డేలోనూ బంగ్లాదేశ్‌ను చిత్తుగా ఓడించిన జింబాబ్వే..





సొంతగడ్డపై జింబాబ్వే రెచ్చిపోతోంది. ఏకైక టెస్టులో బంగ్లాదేశ్‌ను ఇన్నింగ్స్ తేడాతో చిత్తు చేసిన ఆఫ్రికా జట్టు.. ఈసారి వన్డే సిరీస్‌ను పట్టేసింది. రెండో వన్డేలో బెన్ కరన్(111 నాటౌట్) శతకంతో చెలరేగగా.. బౌలింగ్ దళం విజృంభణతో పర్యాటక జట్టును వణికించింది జింబాబ్వే. 248 పరుగుల ఛేదనలో తౌహిద్ హృదయ్(60), తంజిద్(57)లు అర్ధ శతకంతో పోరాడినా.. రిచర్డ్ నగవర(3-55), ముజరబని(33-2), ఎవాన్స్(48-2)ల పేస్ త్రయం ధాటికి మిగతా బ్యాటర్లు తోకముడిచారు. దాంతో, 13 పరుగులతో మట్టికరిపించిన జింబాబ్వే మరో మ్యాచ్ ఉండగానే 2-0తో సిరీస్ గెలుపొందింది.అంతర్జాతీయ క్రికెట్‌లో పూర్వ వైభవం దిశగా జింబాబ్వే అడుగులు వేస్తోంది. అనామక జట్టు అనే ముద్రను తొలగించుకుంటూ ఇటీవల సంచలన విజయాలు సాధించిన ఆఫ్రికన్ టీమ్ స్వదేశంలో వరసగా రెండు సిరీస్‌లు గెలుపొందింది. ఏకైక టెస్టులో బంగ్లాదేశ్‌పై ఇన్నింగ్స్ తేడాతో విజయం సాధించిన జింబాబ్వే వన్డే సిరీస్‌ను కైవసం చేసుకుంది.

# గాఫ్‌పై సంచలన విజయం.. తొలిసారి వింబుల్డన్ ఫైనల్లో ముచోవా..!



వింబుల్డన్ మహిళల సింగిల్స్‌లో కరోలినా ముచోవా సంచలన విజయంతో ఫైనల్‌కు దూసుకెళ్లింది. సెమీఫైనల్లో ఏడో సీడ్ కొకో గాఫ్ ను చిత్తు చేసిన ముచోవా తొలిసారి వింబుల్డన్ టైటిల్ పోరుకు అర్హత సాధించింది. గురువారం హోరాహోరీగా జరిగిన మ్యాచ్‌లో గాఫ్‌పై ఆధిపత్యం చెలాయించిన చెక్ రిపబ్లిక్ క్రీడాకారిణి.. నిర్ణయాత్మక మూడో సెట్‌లో గెలుపొందింది. దాంతో, మొదటిసారి ఆల్ ఇంగ్లండ్ క్లబ్ టోర్నీలో విజేతగా నిలవాలనుకున్న అమెరికా స్టార్ గాఫ్ కల చెదిరింది.గ్రాండ్‌స్లామ్ టోర్నీ వింబుల్డన్‌లో కరోలినా ముచోవా ఫైనల్లో అడుగుపెట్టింది. గురువారం జరిగిన థ్రిల్లింగ్ సెమీస్‌లో కొకో గాఫ్‌ను ఓడించిన ముచోవా తొలిసారి టైటిల్ పోరుకు దూసుకెళ్లింది. తొలి సెట్ నుంచే దూకుడుగా ఆడిన ముచోవా.. 6-2తో గాఫ్‌కి షాకిచ్చింది. అయితే.. రెండో సెట్‌లో పుంజుకున్న అమెరికా టెన్నిస్ స్టార్ 6-1తో పైచేయి సాధించింది.కానీ, నిర్ణయాత్మక మూడో సెట్‌లో ముచోవా చెలరేగిపోయింది. ఒకదశలో ఇద్దరూ 10-10 పాయింట్లతో సమంగా నిలిచినా చెక్ రిపబ్లిక్ ప్లేయర్ ధాటికి గాఫ్ చేతులెత్తేసింది. ఉత్కంఠ రేపిన టై బ్రేక్‌ను 7-6తో గెలుచుకున్న ముచోవా ఏడో సీడ్‌ను ఇంటికి పంపింది. రెండో సెమీస్‌లో ఆడుతున్న మార్టా కొత్సుక్, లిండా నొస్కోవాలో ఒకరితో ముచకోవా ఫైనల్లో తలపడనుంది.


# నేస్తమా ఇక సెలవు.. అఫ్గనిస్థాన్ మాజీ క్రికెటర్‌కు కన్నీటి వీడ్కోలు..!



అఫ్గనిస్థాన్ మాజీ క్రికెటర్ షపూర్ జద్రాన్ (రాష్ట్రుజూశీశీత్గ్ఖంతీఖఅ) అంత్యక్రియలు ముగిశాయి. చిన్నవయసులోనే కన్నుమూసిన అతడికి అఫ్గన్ క్రికెటర్లు, అభిమానులు కన్నీటి వీడ్కోలు పలికారు. మాజీ కెప్టెన్లు రషీద్ ఖాన్, మొహమ్మద్ నబీలు కన్నీళ్లను దిగమింగుతూ అతడి శవపేటకను మోశారు. చరిత్రాత్మకమైన ఈద్గా మసీదులో ప్రార్థనల అనంతరం.. కాబూల్‌లో జద్రాన్ అంత్యక్రియలు పూర్తి చేశారు.అఫ్గనిస్థాన్ క్రికెట్ దిగ్గజాల్లో ఒకడైన షాపూర్ జద్రాన్ కొన్నాళ్లుగా ప్రాణాంతకమైన జబ్బుతో బాధ పడ్డాడు. రోగ నిరోధక వ్యవస్థను నాశనం చేసే హీమోఫాగోసిటిక్ లింఫోహిస్టియోసిస్టోసిస్ (నూఎ) కారణంగా అతడి ఆరోగ్యం క్షీణించింది. భారత్‌లో చికిత్స పొందిన జద్రాన్ ఆస్పత్రిలోనే కన్నుమూశాడు. మృత్యువుతో పోరాడి 38 ఏళ్ల వయసులోనే జద్రాన్ ఈ లోకాన్ని విడిచి వెళ్లాడు. అతడి మృతదేహాన్ని విమానంలో కాబూల్ తరలించారు.

పిల్లల్లో కనిపించే జబ్బు

పదిహేడేళ్ల క్రితం అఫ్గనిస్థాన్ క్రికెట్‌లో అరంగేట్రం చేసిన షపూర్ జద్రాన్‌కు నిరుడు అక్టోబర్ నుంచి అరోగ్యం సరిగా లేదు. వైద్య పరీక్షల అనంతరం అతడికి హీమోఫాగోసిటిక్ లింఫోహిస్టియోసిస్టోసిస్ (నూఎ) అనే ప్రాణాంతకమైన జబ్బు ఉన్నట్టు



వైద్యులు గుర్తించారు. మామూలుగా చిన్న పిల్లల్లో కనిపించే ఈ జబ్బు 37 ఏళ్ల షపూర్‌లో కనిపించడం డాక్టర్లను ఆశ్చర్యానికి గురి చేసింది. ఈ సమస్య కారణంగా ఇన్నిరోజులు షపూర్ చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడు.హెచ్ఎల్‌హెచ్ సమస్య కారణంగా వాపు ఎక్కువవుతాయి. రోగనిరోధక వ్యవస్థ అతిగా స్పందించడం మూలంగా.. ఎముకల మజ్జ, కాలేయం, ప్లీహం, లింఫ్ గ్రంథులు వంటి వాటి పనితీరు దెబ్బ తింటాయి. ఆరడుగుల 2 ఇంచుల పొడవుండే షపూర్ జులపాల జుత్తుతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచేవాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో 80 మ్యాచ్‌లు మాత్రమే ఆడాడీ పేసర్. 2009 నుంచి 2020 మధ్య కాలంలో ఈ పొడగరి స్పీడ్‌స్టర్ 44 వన్డేలు, 36 టీ20ల్లో జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు.

Edited, Published and Owned by Konadoddi Naveen Kumar and Printed at Srinith Publications Falcon Printing Press #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. And Published from #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. Editor's Konadoddi Naveen Kumar, Dr.Tadhkal Rahul Kumar Reg. No.TEL-TEL/2023/12249. Email.HyderabadPulse23@gmail.com, Web:www.HyderabadPulse.com, Cell: +91-94406 53413, +91-9989834020.